

దడ పుట్టిస్తున్న సన్నబియ్యం

సన్నబియ్యం ధరలు భారీగా పెరగడంతో సామాన్యులు ఆందోళన చెందుతున్నారు.

వివరాలు 10లో ▸



తగ్గని ఉల్లి ధర

దేవరకద్ర మార్కెట్‌లో బుధవారం ఉల్లి క్వింటా గరిష్టంగా రూ.3,510 ధర పలికింది.

వివరాలు 10లో ▸

వాతావరణం

గరిష్టం/కనిష్టం
32.4 /19.8

రోజంతా ఆకాశం నిర్మానుష్యంగా ఉంటుంది. అప్పుడప్పుడు మేఘావృతం అవుతుంది. రాత్రి చలి తీవ్రత పెరుగుతుంది.

న్యూస్‌రీల్

విప్లవ పార్టీల ఐక్యతతోనే మార్పు సాధ్యం



అమరచింత: విప్లవ పార్టీల ఐక్యతతో సమాజంలో మార్పు సాధ్యమని సీపీఐ(ఎంఎల్) ప్రజాపంథా రాష్ట్ర కార్యదర్శివర్గ సభ్యుడు కేజీ రాంచందర్ అన్నారు. పట్టణంలోని మార్క్స్ భవనంలో బుధవారం ప్రజాపంథా ఉమ్మడి జిల్లా ముఖ్యనాయకుల సమావేశానికి ఆయన ముఖ్యవక్తగా హాజరై మాట్లాడారు. 14 రాష్ట్రాల్లో వివిధ స్థాయిల్లో పనిచేసే సీపీఐ(ఎంఎల్), సీపీఐ(ఎంఎల్)రివల్యూషనరీ ఇన్షియేటివ్‌తో పాటు ప్రజాపంథా పార్టీలు ఏకమవుతున్నాయన్నారు. ఐక్యత మహాసభను మార్చి 3 నుంచి 5 వరకు ఖమ్మంలో నిర్వహిస్తున్నామని వెల్లడించారు. దేశంలో మతవాద పార్టీల పెత్తనం పెరిగిందని.. మతోన్మాదుల దాడులతో అమాయక ప్రజలు బలవుతున్నా కేంద్రంలోని బీజేపీ ప్రభుత్వం ప్రేక్షక పాత్ర వహిస్తూ దాడులను ప్రోత్సహిస్తోందని ఆరోపించారు. దేశంలో నిరుద్యోగుల ఆత్మహత్యలు పెరుగుతున్నాయని.. ఉపాధి అవకాశాలు లేక బతుకుదెరువు కోసం వలస వెళ్తూ ప్రాణాలు పోగొట్టుకుంటున్నారని ఆవేదన వ్యక్తం చేశారు. కమ్యూనిస్టు పార్టీల ఐక్యతతో దేశంలో జరుగుతున్న ఇలాంటి ఘటనలను నివారించే అవకాశం ఉందన్నారు. కార్యక్రమంలో ప్రజాపంథా రాష్ట్ర నాయకుడు ఎం.కృష్ణ, జిల్లా కార్యదర్శులు సీహెచ్ రాంచందర్, హన్మంతు తదితరులు పాల్గొన్నారు.

జాతీయస్థాయి పోటీలకు జెన్‌కో విద్యార్థులు



ధరూరు: ఈనెల 8, 9 తేదీల్లో హైదరాబాద్‌లోని సఫిల్‌గూడ డీఏవీ పాఠశాలలో నిర్వహించిన రాష్ట్రస్థాయి పోటీల్లో జూరాల జెన్‌కో పాఠశాల విద్యార్థులు ప్రతిభ కనబరిచారు. కబడ్డీ, ఖోఖో, అథ్లెటిక్స్ విభాగాల్లో ప్రథమ స్థానాల్లో నిలిచి, హర్యానాలో నిర్వహించనున్న జాతీయస్థాయి పోటీలకు ఎంపికైనట్లు పాఠశాల హెచ్‌ఎం యాదవరెడ్డి తెలిపారు. ఈ సందర్భంగా బుధవారం పాఠశాలలో ఏర్పాటు చేసిన కార్యక్రమంలో జెన్‌కో ఎస్‌ఈ రామసుబ్బారెడ్డి, డీఈ పవన్‌కుమార్, ఏఆర్‌ఓ జీఆర్‌కే ప్రసాద్, వ్యాయామ ఉపాధ్యాయుడు రవి విద్యార్థులను అభినందించారు. మున్ముందు మరిన్ని పోటీల్లో రాణించాలని ఆకాంక్షించారు.

సైనిక్ స్కూల్‌లో ప్రవేశాలకు దరఖాస్తులు

మహబూబ్‌నగర్ ఎడ్యుకేషన్: దేశవ్యాప్తంగా 33 ప్రాంతాల్లో ఉన్న సైనిక్ స్కూల్‌లో 2024–25 విద్యా సంవత్సరాలనికి గాను వివిధ తరగతుల్లో అడ్మిషన్లు పొందేందుకు విద్యార్థుల నుంచి దరఖాస్తులు స్వీకరిస్తున్నట్లు డీఈఓ రవీందర్ బుధవారం ఒక ప్రకనటలో తెలిపారు. ఆసక్తి గలవారు ఈ నెల 16లోగా ఆన్‌లైన్‌లో దరఖాస్తులు చేసుకోవాలని, జనవరి 1న పరీక్ష ఉంటుందని చెప్పారు.

సమస్యలపై అసెంబ్లీలో చర్చిస్తా

నర్వ: మండల సమస్యలపై నేడు జరగబోయే అసెంబ్లీ రెండురోజుల సెషన్‌లో చర్చిస్తానని ఎమ్మెల్యే వాకిటి శ్రీహరి అన్నారు. బుధవారం ఎంపీపీ జయరాములుశెట్టి అధ్యక్షతన నిర్వహించిన మండల సర్వసభ్య సమావేశానికి ఆయన ముఖ్యఅతిథిగా హాజరై మాట్లాడారు.. మండల సమావేశానికి కాస్త ఆలస్యంగా వచ్చానని సభ్యులు మన్నించాలన్నారు. త్వరలో మండల సమస్యలను చర్చించేందుకు ఒక్కరోజు రివ్యూ సమావేశం ఏర్పాటుచేయాలని, అన్నిశాఖల ముఖ్య అధికారులు, మండల ప్రజాప్రతినిధులు హాజరై లోతుగా విశ్లేషణ చేసి పరిష్కారానికై చర్చిద్దామన్నారు. ఈ సందర్భంగా రాష్ట్ర వ్యాప్తంగా మహిళలకు మహాలక్ష్మీ పథకం ద్వారా ఉచితబస్సు ప్రయాణం కల్పించడంపై పెద్దకడ్మూర్ సర్పంచ్ శశిరేఖ ఎమ్మెల్యేకు కృతజ్ఞతలు తెలియజేశారు. అన్ని గ్రామాల్లో రోడ్లను మరమ్మతులు చేసి మరిన్ని బస్సులను ఏర్పాటు చేయాలని ఆమె కోరారు. కల్వాల్ ఎంపీటీసీ సుధాకర్‌రెడ్డి మాట్లాడుతూ.. రైతులకు 24గంటల విద్యుత్ కాంగ్రెస్ ప్రభుత్వం ఇస్తుందని అసెంబ్లీ సాక్షిగా చెప్పించాలని కోరారు. అనంతరం ఎమ్మెల్యే మాట్లాడుతూ.. రైతులకు గత ప్రభుత్వం కంటే నాణ్యమైన విద్యుత్ కాంగ్రెస్ ప్రభుత్వం అందిస్తుందని, రైతులు ఎలాంటి అపోహలు నమ్మొద్దన్నారు. జెడ్పీ చైర్‌పర్సన్ వనజమ్మ, ఎంపీపీ జయరాములుశెట్టి, వైస్ ఎంపీపీ వీణావతి, ఎంపీడీఓ సుదర్శన్, పీఏసీఎస్ చైర్మన్ శ్రీనివాస్‌రెడ్డి, తహసీల్దార్ మల్లారెడ్డి, బండ్ల లక్ష్మీకాంత్‌రెడ్డి పాల్గొన్నారు.

సదా ప్రజాసేవలో..

అర్హులందరికీ ఇందిరమ్మ ఇళ్లు, యువతకు ఉపాధి అవకాశాలు

- జీఓ నంబర్ 46 రద్దుపై అసెంబ్లీలో మాట్లాడుతా..
- 'సాక్షి' ఫోన్–ఇన్‌లో ఎమ్మెల్యే తూడి మేఘారెడ్డి



మాట్లాడుతున్న ఎమ్మెల్యే తూడి మేఘారెడ్డి

ప్రజలంతా ఆత్మగౌరవంతో జీవించేలా కాంగ్రెస్ పాలన సాగుతోందని, పాలకులం కాదు.. సేవకులమని ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డి చూపిన బాటలో నడుస్తూ సమస్యలపై ఎప్పటికప్పుడు స్పందించి పరిష్కరించేందుకు కృషి చేస్తానని ఎమ్మెల్యే తూడి మేఘారెడ్డి అన్నారు. బుధవారం జిల్లాకేంద్రంలోని ఎమ్మెల్యే క్యాంపు కార్యాలయంలో 'సాక్షి' ఆధ్వర్యంలో నిర్వహించిన ఫోన్–ఇన్‌కు నియోజకవర్గ ప్రజలు ఫోన్‌చేసి తమ సమస్యలు విన్నవించగా పరిష్కారానికి తీసుకునే చర్యలను వివరించారు. గంటపాటు జరిగిన ఈ కార్యక్రమానికి సుమారు 40కిపైగా ఫోన్‌కాల్స్ వచ్చాయి.

– వనపర్తి

సాక్షి ఫోన్ ఇన్

ప్రశ్న: జీఓనంబర్ 46 రద్దు చేయాలి.. తక్కువ మార్కులు వచ్చిన వారికి పోలీసు ఉద్యోగం ఇచ్చారు.

– ఆనంద్, పెబ్బేరు

ఎమ్మెల్యే : బీఆర్‌ఎస్ ప్రభుత్వం ఇచ్చిన జీఓనంబర్ 46తో అత్యధికంగా పాలమూరు జిల్లా యువత పోలీస్ ఉద్యోగాలు కోల్పోయారనే విషయం ఇదివరకే మా దృష్టికి వచ్చింది. ఈ విషయాన్ని ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డి దృష్టికి తీసుకెళ్తా. రానున్న అసెంబ్లీ సమావేశాల్లో మాట్లాడి త్వరలోనే జీఓ రద్దుకు ప్రయత్నం చేస్తా.

ప్రశ్న: పట్టా పొలంలో దౌర్జన్యంగా కాల్వ తవ్వుతున్నారు.

– ఆంజనేయులు, పాల్కెపహాడ్, గోపాల్‌పేట

ఎమ్మెల్యే: నీటిపారుదలశాఖ అధికారులు ఇదివరకే సర్వే చేశారు. దాని ప్రకారమే కాల్వ తవ్వాల్సి ఉంటుంది. మీ విషయంలో ఎక్కడ పొరపాటు జరిగిందో అధికారులతో విచారణ చేయిస్తాం.

ప్రశ్న: జిల్లాకేంద్రంలోని సాగర్‌కాలనీలో పైప్‌లైన్ పేరుతో తవ్విన గుంత పూడ్చడం లేదు.

– శ్రీనివాసశర్మ, వనపర్తి

ఎమ్మెల్యే: పైప్‌లైన్ ఏర్పాటుకు తవ్విన గుంతను పని పూర్తికాగానే పూడ్చివేయాలి. నిర్లక్ష్యం ఎక్కడ జరిగిందో మున్సిపల్ అధికారులతో తెలుసుకొని సమస్య పరిష్కారానికి చర్యలు తీసుకుంటాం.

ప్రశ్న: వైద్య కళాశాలలో నాకు రావాల్సిన ఉద్యోగం ఉద్దేశపూర్వకంగా వేరొకరికి ఇచ్చారు. న్యాయం చేయాలి.

– వేణుస్వామి, విశ్రాంత ఆర్మీ ఉద్యోగి, తూంకుంట, పాన్‌గల్

ఎమ్మెల్యే: మెడికల్ కళాశాలలో ఉద్యోగాల భర్తీ ఏ ప్రాతిపదికన చేశారో తెలుసుకొని మీకు అర్హత ఉంటే తప్పకుండా న్యాయం చేస్తాం.

ప్రశ్న: 75 శాతం వికలత్వం ఉన్నా.. పింఛన్ ఇవ్వడం లేదు.

– నరసింహ, యాపర్ల, పెబ్బేరు

ఎమ్మెల్యే: 75 శాతం వికలత్వం ఉన్నట్లు వైద్యులు ధ్రువీకరిస్తే నిబంధనల ప్రకారం పింఛన్ ఇవ్వాల్సిందే. ఎందుకు ఇవ్వలేదో విచారణ చేసి మీకు పింఛన్ ఇప్పించేందుకు కృషి చేస్తా.

ప్రశ్న: నేను దివ్యాంగురాలిని. చిన్న చిన్న పనుల నిమిత్తం బయట తిరగేందుకు ఇబ్బందులు కలుగుతున్నాయి. మూడుచక్రాల బండి ఇప్పించండి.

– మహబూబ్‌బీ, దివ్యాంగురాలు, పీర్లగుట్ట, వనపర్తి

ఎమ్మెల్యే: జిల్లా సంక్షేమశాఖలో దరఖాస్తు చేసుకోండి.. అతిత్వరలో మీకు, మీతో పాటు అర్హత గల దివ్యాంగులకు మూడుచక్రాల వాహనాలు ఇప్పిస్తాం.

ప్రశ్న: రెండు పడక గదుల ఇళ్ల వద్ద సౌకర్యాలు కల్పించండి.

– అతియాబేగం, చిట్యాల రోడ్డు, వనపర్తి

ఎమ్మెల్యే: ఇళ్ల కేటాయింపునకు ముందే అన్ని సౌకర్యాలు కల్పించాల్సి ఉండింది. అక్కడి పరిస్థితిని స్వయంగా పరిశీలించి వసతులు సమకూరుస్తాం.

ప్రశ్న: కూరగాయల విక్రయాలను కొత్త మార్కెట్‌కు తరలించాలి.

– శ్రీనివాస్, కమాన్ చౌరస్తా, వనపర్తి

ఎమ్మెల్యే: అందరి ఆమోదంతో కూరగాయల విక్రయాలను మార్కెట్‌లో నిర్వహించేందుకు ప్రయత్నం చేస్తాం.

ప్రశ్న: ప్రైవేట్ ఆస్పత్రుల్లో వైద్య పరీక్షల పేరుతో దోపిడీకి పాల్పడుతున్నారు.

– చింతకుంట విష్ణు, వనపర్తి

ఎమ్మెల్యే: జిల్లాకేంద్రంలో ఈ సమస్య ఉన్నట్లు ఇదివరకే నా దృష్టికి వచ్చింది. వైద్యశాఖ అధికారులతో సమీక్ష నిర్వహించి అధికారుల పర్యవేక్షణ పెంచేందుకు కృషి చేస్తా.

ప్రశ్న: ఏదుల నిర్వాసితులకు పరిహారం పూర్తిగా ఇవ్వలేదు. సమస్యల పరిష్కారానికి చర్యలు తీసుకోవాలి.

ఎమ్మెల్యే: ఏదుల రిజర్వాయర్ నిర్వాసితుల సమస్యల పరిష్కారానికి అధికారులతో కలిసి గ్రామానికే వస్తాం. ఇందుకోసం ప్రణాళిక సిద్ధం చేసుకున్నా.

– బాబు, బండరావిపాకుల, రేవల్లి.

ప్రశ్న: పంటల సాగుకు స్ప్రింక్లర్లు ఇప్పించండి.

ఎమ్మెల్యే: గత ప్రభుత్వ హయాంలో రాజకీయ పలుకుబడి ఉన్న వాళ్లకే స్ప్రింక్లర్లు వచ్చేవని తెలిసింది. ఈ విషయం తెలుసుకునేందుకు వచ్చిన దరఖాస్తులు, మంజూరు తదితర వివరాలతో నివేదిక అందించాలని అధికారులను కోరాం. సమీక్ష నిర్వహించి పేద రైతులకు అందించేందుకు ప్రయత్నం చేస్తాం.

– రాజేష్, రైతు

ప్రశ్న: భూమిలేని వారికి ఆర్థిక సాయం అందించండి.

– శ్రీకాంత్‌రెడ్డి, మనిగిళ్ల, పెద్దమందడి

ఎమ్మెల్యే: గుంట భూమి లేకపోయినా.. వ్యవసాయ ఆధారిత కుటుంబాలకు రూ.వెయ్యి ఆర్థిక సాయం అందించాలని ప్రభుత్వ యోచనలో ఉంది. త్వరలో అమలు చేస్తాం.

ప్రశ్న: అతిథి అధ్యాపకుల దీర్ఘకాలిక సమస్యలు పరిష్కరించండి.

– శివలీల, వనపర్తి

ఎమ్మెల్యే: మీలాంటి వారు రాష్ట్ర వ్యాప్తంగా 405 కళాశాలల్లో రెండు వేల వరకు ఉన్నారు. ఈ విషయం సీఎం రేవంత్‌రెడ్డి దృష్టిలో ఉంది. మీ సమస్యను మరోసారి సీఎంకు వివరిస్తా.

ప్రశ్న: మా గ్రామానికి బస్ సౌకర్యం కల్పించండి.

– డి.యోగానందరెడ్డి, తాటిపాముల, శ్రీరంగాపురం

ఎమ్మెల్యే: మీ గ్రామంతో పాటు వనపర్తి మండలం అచ్యుతాపురం, పెద్దమందడి మండలం దొడగుంటపల్లి, ఖిల్లాఘనపురం మండలంలో సూరాయపల్లి గ్రామాల నుంచి బస్ సౌకర్యం కోసం ఫోన్‌కాల్స్ వచ్చాయి. మునుపు బస్ సౌకర్యం ఉండి ఇటీవల రద్దు చేసిన రూట్లలో రవాణా వసతి కల్పించేందుకు డీఎంతో మాట్లాడుతా.

గెలుపోటములు సాధారణం



సమావేశంలో పాల్గొన్న జెడ్పీ చైర్మన్ లోక్‌నాథ్‌రెడ్డి, ఎమ్మెల్యే మేఘారెడ్డి

- జెడ్పీ చైర్మన్ లోక్‌నాథ్‌రెడ్డి

ఖిల్లాఘనపురం: రాజకీయాల్లో గెలుపు, ఓటమి అనేది సర్వసాధారణమని.. ప్రజాప్రతినిధులు ఎవరూ ఆందోళన చెందాల్సిన అవసరం లేదని, ఇప్పటి వరకు జిల్లాలో అగ్రిమెంట్ అయిన ప్రతి పనికి సంబంధించిన బిల్లు ఇప్పించే బాధ్యత తనదని జెడ్పీ చైర్మన్ లోక్‌నాథ్‌రెడ్డి అన్నారు. బుధవారం మధ్యాహ్నం మండల కేంద్రంలోని ఎంపీడీఓ కార్యాలయ సమావేశ మందిరంలో ఎంపీపీ కృష్ణానాయక్ అధ్యక్షతన జరిగిన మండల సర్వసభ్య సమావేశానికి ఆయన ముఖ్యఅతిథిగా హాజరయ్యారు. పంచాయతీరాజ్‌శాఖపై సమీక్ష జరుగుతున్న సమయంలో పలుగ్రామాల సర్పంచులు మాట్లాడుతూ.. ఇప్పటి వరకు చేసిన పనుల బిల్లులు, తీర్మానాలు చేసిన పనుల బిల్లులు వస్తాయా రావా.. మధ్యలో వదిలేసిన పనుల సంగతి ఏమిటి.. కొత్త ప్రభుత్వం బిల్లులు చెల్లిస్తుందా అని ప్రశ్నించారు. ఈ సందర్భంగా జెడ్పీ చైర్మన్ మాట్లాడుతూ.. పూర్తయిన పనుల బిల్లులు చెల్లించేలా చర్యలు తీసుకుంటామన్నారు. అవసరమైతే కోర్టుకు వెళ్లడానికైనా సిద్ధమని తెలిపారు. ఒకవేళ బిల్లులు రాకుంటే జిల్లాలో తిరగనని చెప్పారు. గత 16 నెలలుగా పంచాయతీలకు ఎస్‌ఎఫ్‌సీ నిధులు రావడం లేదని.. ఎమ్మెల్యే మేఘారెడ్డి ప్రభుత్వం దృష్టికి తీసుకెళ్లి విడుదల చేయించాలని సర్పంచులు కోరారు. ఇందుకు ఎమ్మెల్యే స్పందిస్తూ.. ఇప్పటి వరకు రావాల్సిన ఎస్‌ఎఫ్‌సీ నిధుల గురించి చెప్పలేనని.. ఈ నిధులతో సర్పంచ్‌లు అభివృద్ధి పనులు చేసి ఉంటే వచ్చేలా చర్యలు తీసుకుంటానని చెప్పారు. ఆ వివరాలను ఎంపీడీఓ ద్వారా తనకు పంపాలని సూచించారు. ఎంపీపీ కృష్ణానాయక్, జెడ్పీటీసీ సభ్యుడు సామ్యానాయక్, సింగిల్‌విండో చైర్మన్ మురళీధర్‌రెడ్డి, వైస్ చైర్మన్, ఎంపీడీఓ విజయ్‌కుమార్, వివిధ గ్రామాల సర్పంచులు, ఎంపీటీసీ సభ్యులు, వివిధ శాఖల అధికారులు పాల్గొన్నారు.

ఆత్మకూర్ ఎంపీపీపై అవిశ్వాసం

- రెండ్రోజుల్లో ఎంపీటీసీలకు నోటీసులు ఇస్తామన్న ఎంపీడీఓ
- తదుపరి ఎంపీపీ, వైస్ ఎంపీపీ ఎవరన్న దానిపై చర్చ

ఆత్మకూర్: స్థానిక ఎంపీపీ, వైస్ ఎంపీపీపై అవిశ్వాసం ప్రకటిస్తూ కాంగ్రెస్ ఎంపీటీసీ సభ్యులు అదనపు కలెక్టర్ తిరుపతిరావుకు వినతిపత్రం అందజేశారు. ప్రస్తుతం మండలంలో ఏడుగురు ఎంపీటీసీ సభ్యులున్నారు. ఎంపీపీ బంగారు శ్రీనివాసులు (బీఆర్‌ఎస్) పిన్నంచర్ల ఎంపీటీసీ, వైస్ ఎంపీపీ కోటేష్ (బీఆర్‌ఎస్) ఆరేపల్లి, శ్యామల (బీఆర్‌ఎస్) మూలమళ్ల, అలివేలు బీసన్న (బీఆర్‌ఎస్) రేచింతల, శారద సోమాంజి (బీఆర్‌ఎస్)దేవరపల్లి, పరమేష్ (కాంగ్రెస్) జూరాల, సుచిత్ర (కాంగ్రెస్) తిప్పడంపల్లి ఉన్నారు. ఇటీవలే రేచింతల ఎంపీటీసీ అలివేలు, దేవరపల్లి ఎంపీటీసీ శారద ఎమ్మెల్యే వాకిటి శ్రీహరి సమక్షంలో కాంగ్రెస్‌పార్టీలో చేరడంతో కాంగ్రెస్ బలం నాలుగుకు చేరింది. సోమవారం నలుగురు కాంగ్రెస్ ఎంపీటీసీలు అదనపు కలెక్టర్ తిరుపతిరావును కలిసి ఎంపీపీ, వైస్ ఎంపీపీపై అవిశ్వాసం ప్రకటిస్తూ వినతిపత్రం అందజేశారు. కాగా ఈ విషయమై మండలంలో చర్చ జోరుగా సాగుతోంది. అవిశ్వాసం నెగ్గి తదుపరి ఎంపీపీ, వైస్ ఎంపీపీలు ఎవరు అవుతారని చర్చ కొనసాగుతుంది. జూరాల ఎంపీటీసీ పరమేష్ ఎంపీపీగా, తిప్పడంపల్లి ఎంపీటీసీ సుచిత్ర వైస్ ఎంపీపీ అయ్యే అవకాశం ఉంది. ఇదిలా ఉండగా.. జిల్లా ఉన్నత అధికారుల ఆదేశాల మేరకు రెండ్రోజుల్లో ఎంపీటీసీ సభ్యులకు నోటీసులు అందజేస్తామని ఎంపీడీఓ వెంకటేశ్వర్లు తెలిపారు.

అభివృద్ధి పనుల పునః ప్రారంభం సరికాదు

- పుర చైర్మన్, బీఆర్‌ఎస్ జిల్లా అధ్యక్షుడు గట్టుయాదవ్



మాట్లాడుతున్న పుర చైర్మన్ గట్టుయాదవ్

వనపర్తిటౌన్: స్థానికంగా పుర పాలకవర్గం ఉందని ఎమ్మెల్యే మేఘారెడ్డి గుర్తించాలని.. ఇదివరకే ప్రారంభించిన పనులను తిరిగి ప్రారంభించడం సరైంది కాదని మున్సిపల్ చైర్మన్, బీఆర్‌ఎస్ జిల్లా అధ్యక్షుడు గట్టుయాదవ్ కోరారు. బుధవారం పురపాలిక కార్యాలయంలోని తన ఛాంబర్‌లో ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో ఆయన మాట్లాడారు. మాజీ మంత్రి నిరంజన్‌రెడ్డి వనపర్తి పురపాలికకు రూ.15 కోట్లు మంజూరు చేస్తే అన్ని వార్డులకు సమ ప్రాధాన్యం ఇస్తూ 44 పనులను ఈ ఏడాది ఆగస్టు 24న ప్రారంభించామని తెలిపారు. కాంగ్రెస్ ప్రభుత్వం నుంచి కొత్తగా నిధులు తెచ్చి ప్రారంభాలు చేసేందుకు ఎమ్మెల్యే చొరవ చూపాలని విజ్ఞప్తి చేశారు. పుర కమిషనర్ ప్రత్యేక అధికారి పాలన అనుకుంటున్నారని.. పాలకవర్గం ఉందనే విషయాన్ని మర్చిపోవద్దని, అనుమతి లేకుండా అధికారులు వెళ్లడం సరైంది కాదన్నారు. సీనియర్ కౌన్సిలర్ లక్ష్మీనారాయణ మాట్లాడుతూ.. కౌన్సిల్‌కు సమాచారం ఇవ్వకుండా ప్రారంభోత్సవాలు చేయడంతో ఘర్షణ వాతావరణం తలెత్తుతుందని.. ఇక నుంచి సమస్య పునరావృతం కాకుండా చూడాలని కోరారు. సమావేశంలో కౌన్సిలర్లు నాగన్న, పాకనాటి కృష్ణ, కంచె రవి, వనపర్తి అసెంబ్లీ సోషల్ మీడియా కో–ఆర్డినేటర్ నందిమళ్ల అశోక్, నాయకులు ఉంగ్లం తిరుమల్, ఎల్‌ఐసీ కృష్ణ, స్టార్ రహీం, గోపాల్ యాదవ్ తదితరులు పాల్గొన్నారు.

రేపు జిల్లాకేంద్రంలో క్రాస్‌కంట్రీ ఎంపికలు

వనపర్తిటౌన్: 9వ రాష్ట్రస్థాయి క్రాస్‌కంట్రీ ఛాంపియన్‌షిప్ 2023 పోటీలు కామారెడ్డి జిల్లాలో ఈ నెల 23న కొనసాగుతాయని జిల్లా అథ్లెటిక్స్ అసోసియేషన్ అధ్యక్షుడు వాకిటి శ్రీధర్, ప్రధానకార్యదర్శి బి.నరసింహ బుధవారం తెలిపారు. జిల్లా జట్టు ఎంపికలు ఈ నెల 15న జిల్లాకేంద్రంలో నిర్వహిస్తున్నట్లు వెల్లడించారు. అండర్–16, 18, 20 పోటీల్లో రెండు కిలోమీటర్ల నుంచి 8 కిలోమీటర్ల ఈవెంట్లు ఉంటాయని చెప్పారు. అండర్–16కు 2008, జనవరి 16 నుంచి 2010, జనవరి 15 మధ్య జన్మించిన వారు అర్హులన్నారు. అలాగే అండర్–18 బాలుర 6 కి.మీ., బాలికలు 4 కి.మీ. పోటీలకు 2006, జనవరి 16 నుంచి 2008, అక్టోబర్ 15 మధ్య జన్మించిన వారు, అండర్ 20 పురుషుల పోటీలు 8 కి.మీ., మహిళలు 6 కి.మీ.ల ఈవెంట్లు ఉంటాయని 2004, జనవరి 16 నుంచి 2006, జనవరి 15 మధ్య జన్మించిన వారు అర్హులని తెలిపారు. పూర్తి వివరాలకు సెల్‌ఫోన్ నంబర్లు 99086 29908, 94413 53375, 80961 15222 సంప్రదించాలని సూచించారు.

వీడని మూఢ'నమ్మకం'

ఉమ్మడి పాలమూరులో కొనసాగుతున్న మంత్రగాళ్ల ఆగడాలు

- నల్లమల పరిసరాల్లో యథేచ్ఛగా గుప్తనిధుల వేట
- మాయమాటలతో నిండా ముంచుతున్న కేటుగాళ్లు
- ఆస్తులు, ప్రాణాలు కోల్పోతున్న అమాయకులు
- ఫిర్యాదులు వస్తున్నా చలించని పోలీస్ అధికారులు

సాక్షి, నాగర్‌కర్నూల్: ఆధునిక సాంకేతికత కొత్తపుంతలు తొక్కుతున్నా.. ఉమ్మడి పాలమూరు జిల్లాలోని పలుచోట్ల మంత్రాలు, తంత్రాలపై నమ్మకాల జాడ్యం ఇంకా వీడటం లేదు. ఓవైపు పోలీసులు మూఢనమ్మకాలపై ఎప్పటికప్పుడు ప్రజల్లో విస్తృతంగా అవగాహన కల్పిస్తున్నామని చెబుతున్నా.. ఇప్పటికీ మంత్రాల పేరుతో మాయ చేసే మరాఠీలు మోసాలకు పాల్పడుతూనే ఉన్నారు. కుటుంబ సమస్యలు, గొడవలు, ఆర్థిక ఇబ్బందులు, అనారోగ్య కారణాలు ఏవైనా బాధితులు మంత్రాలు చేస్తామని నమ్మించే వారిని ఆశ్రయిస్తున్నారు. ఇదే అదునుగా భావిస్తున్న మాయగాళ్లు గుప్తనిధుల ఆశ చూపుతూ ఉన్న ఆస్తులకే ఎసరు పెడుతున్నారు. ఈ క్రమంలో కొంతమంది బాధితులు తమ ప్రాణాల మీదకు తెచ్చుకుంటున్నారు. తాజాగా నాగర్‌కర్నూల్ జిల్లాకేంద్రానికి చెందిన మాయగాడు రామటి సత్యనారాయణయాదవ్ చేతుల్లో ఏకంగా 11 మంది అమాయకులు బలి కావడం రాష్ట్రవ్యాప్తంగా సంచలనం సృష్టించింది.

అమాయకత్వమే ఆసరాగా..

అనారోగ్య కారణాలు, కుటుంబ సమస్యలు, ఆర్థిక ఇబ్బందులతో మంత్రగాళ్లు, నాటువైద్యులను ఆశ్రయించే వారి సంఖ్య ఎక్కువగానే ఉంటోంది. ఇదే అదునుగా భావిస్తున్న మాయగాళ్లు అందినకాడికి దోచుకుంటున్నారు. వ్యవస్థీకృతంగా ఏర్పాట్లు చేసుకుని మరీ బహిరంగంగానే ఈ దందా కొనసాగిస్తున్నా.. పోలీసులు పట్టించుకోవడం లేదన్న విమర్శలున్నాయి. కొన్నిసార్లు బాధితులు ముందుకు వచ్చి ఫిర్యాదు చేస్తున్నా పోలీసులు చలించడం లేదన్న ఆరోపణలు వ్యక్తమవుతున్నాయి. ఈ క్రమంలోనే జిల్లాలోని కొందరు పోలీస్ అధికారులను మచ్చిక చేసుకుని, వారి సాయంతోనే నిందితుడు సత్యనారాయణయాదవ్ ఇన్నాళ్లు తప్పించుకుని తిరిగాడన్న విమర్శలు గుప్పుమన్నాయి.



అమ్రాబాద్ మండలం లక్ష్మాపూర్ శివారులోని నవనారసింహా ఆలయంలో తవ్వకాలు (ఫైల్)



మన్ననూర్ ప్రతాపరుద్రుడి కోట వద్ద అదుపులోకి తీసుకున్న నిందితులు (ఫైల్)

తరుచుగా ఘటనలు..

నల్లమల అటవీ ప్రాంతంలో గుప్తనిధుల వేటకు అడ్డుకట్ట పడడం లేదు. నల్లమలలోని పురాతన ఆలయాలే లక్ష్యంగా దుండగులు తరుచుగా తవ్వకాలకు పాల్పడుతున్నారు. ఈ క్రమంలో విలువైన విగ్రహాలు ధ్వంసమై ఆలయాల ఆనవాళ్లే లేకుండా పోతున్నాయి. పురాతన ఆలయాలను ఎంచుకుని పక్కా ప్లాన్‌తో దుండగులు తవ్వకాలకు పాల్పడుతున్నారు. ఎన్నిసార్లు పట్టుబడినా.. తిరిగి తవ్వకాలు మాత్రం కొనసాగుతూనే ఉన్నాయి. రెండేళ్ల కిందట అమ్రాబాద్ మండలంలోని రాయలగండిలో వెలసిన శ్రీలక్ష్మీచెన్నకేశవస్వామి ఆలయంలో గుప్తనిధుల కోసం తవ్వకాలు జరిపారు. అమ్రాబాద్– పదర ప్రధాన రహదారి పక్కనే ఉన్న ఈ ఆలయంలోని పురాతన రాతి శిల్పాన్ని డ్రిల్లింగ్ మిషన్‌తో తవ్వి మరీ శిల్పంలోని పద్మాన్ని ఎత్తుకెళ్లారు. మూడేళ్ల కిందట కూడా ఇదే ఆలయంలో తవ్వకాలకు యత్నించి ప్రజలను చూసి పారిపోతుండగా.. స్థానికులు పట్టుకుని పోలీసులకు అప్పగించారు. పురాతన ఆలయాల్లో గుప్తనిధులు ఉన్నాయనే ఆశతో తరుచుగా తవ్వకాలు జరుపుతున్నారు. ఫలితంగా అపురూపమైన ఆలయాలు, విగ్రహాలు ధ్వంసమవుతున్నాయి. ఒక్క నల్లమలలోనే కాకుండా ఉమ్మడి జిల్లావ్యాప్తంగా ఇలాంటి ఘటనలు తరుచుగా వెలుగులోకి వస్తూనే ఉన్నాయి.

నేరగాళ్లపై ప్రత్యేక నిఘా..



జిల్లాలోని పలుచోట్ల గుప్తనిధుల తవ్వకాలకు పాల్పడుతున్నారన్న సమాచారం ఉంది. ప్రతి పోలీస్ స్టేషన్ పరిధిలో ఇలాంటి నేరస్తులపై ప్రత్యేక నిఘా ఉంచుతాం. వారిని కట్టడి చేసేందుకు అవసరమైన చర్యలు తీసుకుంటాం. మంత్రాలు, మాయల పేరుతో మోసం చేసే వారిని ప్రజలు నమ్మవద్దు. ఈ విషయంలో ప్రజలందరికీ పోలీస్‌శాఖ తరపున అవగాహన కల్పిస్తున్నాం. ఇలాంటి వారికి సంబంధించి ఏదైనా సమాచారం ఉంటే ప్రజలు నేరుగా పోలీసుల దృష్టికి తేవాలి.

– వైభవ్ గైక్వాడ్, ఎస్పీ, నాగర్‌కర్నూల్

ఆదరణ కోల్పోతున్న పురాతన ఆలయాలు

నల్లమలలో ఉమామహేశ్వరక్షేత్రం, మద్దిమడుగు, సలేశ్వరం, లొద్దిమల్లయ్య, అప్పాపూర్ పెంట, భౌరాపూర్ వద్ద ఉన్న భ్రమరాంబికా ఆలయాలు ప్రధానమైనవి. ఈ ఆలయాలతో పాటు లోతట్టు ప్రాంతంలోని చెన్నకేశవస్వామి ఆలయంలో కూడా తవ్వకాలు వెలుగు చూశాయి. అమ్రాబాద్ మండలం లక్ష్మాపూర్ శివారులోని నవనారసింహ ఆలయంలో తరుచుగా గుప్తనిధుల వేట కొనసాగుతోంది. ఇప్పటికే ఇక్కడ ఉన్న తొమ్మిది నారసింహ విగ్రహాల్లో నాలుగు ధ్వంసమవగా.. మిగతా వాటికి ఎలాంటి రక్షణ లేక ప్రమాదపు అంచున ఉన్నాయి. గతంలోనూ రాయలగండి వద్ద ఆలయ సమీపంలో పరికరాలతో గుప్తనిధుల కోసం అన్వేషిస్తుండగా స్థానికులు పట్టుకున్నారు. మన్ననూర్ వద్ద ఈ దుండగులతో పాటు కారు, గుప్తనిధుల అన్వేషణ కోసం తెచ్చుకున్న పరికరాలను పట్టుకుని పోలీసులకు అప్పగించారు. పదర మండలంలోని లక్ష్మీచెన్నకేశవస్వామి ఆలయంలోని ధ్వజస్తంభానికి ఎదురుగా ఉన్న అగ్నిగుండంలో గుప్తనిధుల కోసం తవ్వకాలు జరిపారు. అమ్రాబాద్ టైగర్ రిజర్వ్ ఫారెస్ట్ పరిధిలోని భౌరాపూర్ భ్రమరాంబిక ఆలయంలోనూ గుప్తనిధుల తవ్వకాలు జరగడంతో ఉనికి కోల్పోతున్నాయి.

క్లుప్తంగా

కేఎల్ఐ కాల్వ పక్కన సేద తీరుతుండగా..

● టిప్పర్ ఢీకొని యువకుడి మృతి



నాగర్‌కర్నూల్ రూరల్: మండలంలోని గుడిపల్లిలో బుధవారం సాయంత్రం టిప్పర్ ఢీకొన్న ఘటనలో ఓ యువకుడు మృతి చెందాడు. గ్రామస్తులు తెలిపిన వివరాల ప్రకారం.. గ్రామానికి చెందిన గువ్వల రమేష్ (20) నాగర్‌కర్నూల్ ప్రభుత్వ డిగ్రీ కళాశాలలో ఒకేషనల్ మొదటి సంవత్సరం చదువుతున్నాడు. కళాశాల నుంచి వచ్చిన యువకుడు ఇంటికి తాళం వేసి ఉండడంతో పక్కనే ఉన్న కేఎల్ఐ కాల్వ ఒడ్డుకు వెళ్లాడు. కాల్వ డివైడర్‌పై కూర్చుని ఉండగా నాగర్‌కర్నూల్ నుంచి రేవల్లి వైపు వెళ్తున్న టిప్పర్ ఢీకొట్టింది. దీంతో డివైడర్‌పై కూర్చున్న రమేష్ ఒక్కసారిగా కెనాల్‌లో పడిపోగా పక్కనే ఉన్న మరో యువకుడు చెన్నారి రవి కేకలు వేయడంతో గ్రామస్తులు చేరుకుని యువకుడిని బయటకి తీశారు. చికిత్స నిమిత్తం నాగర్‌కర్నూల్ జిల్లా ఆస్పత్రికి తరలించారు. చికిత్స పొందుతూ యువకుడు మృతి చెందాడు. ఈ ఘటనపై తండ్రి చిన్నపర్వతాలు ఫిర్యాదు మేరకు ఎస్ఐ మహేందర్ కేసు నమోదు చేసి టిప్పర్ డ్రైవర్ సృజన్‌ను అదుపులోకి తీసుకుని దర్యాప్తు చేస్తున్నారు.

పేకాట స్థావరంపై పోలీసుల దాడి

మక్తల్: పట్టణ శివారులో నిర్వహిస్తున్న పేకాట స్థావరంపై బుధవారం పోలీసులు దాడి చేశారు. పేకాట ఆడుతున్న ఏడుగురిపై కేసు నమోదు చేసినట్లు ఎస్ఐ పర్వతాలు తెలిపారు. వారి నుంచి రూ.15,350 నగదుతో పాటు 5 సెల్‌ఫోన్లు 6 బైక్‌లను స్వాధీనం చేసుకున్నట్లు పేర్కొన్నారు.

ప్రమాదవశాత్తు ఇంటికి నిప్పు



గండేడ్: అర్ధరాత్రి ప్రమాదవశాత్తు ఇంటికి నిప్పంటుకున్న ఘటన మండలంలోని చెన్నాయిపల్లితండాలో చోటు చేసుకుంది. వివరాల్లోకి వెళితే చెన్నాయపల్లితండాకు చెందిన చందర్‌నాయక్ తన కుటుంబ సభ్యులతో కలిసి తన రెండో ఇంట్లో నిద్రకు ఉపక్రమించాడు. అర్ధరాత్రి అనుకోకుండా ఇంటి నుంచి మంటలు పెద్ద ఎత్తున వచ్చాయి. వెంటనే ఆయన స్పందించి స్థానికుల సాయంతో మంటలు ఆర్పారు. అప్పటికే ఇల్లు దూలం, వాసాలు సగానికి పైగా కాలిపోయి కట్టెలు బండలు కిందపడ్డాయి. దీంతో ఇంట్లో ఉన్న బియ్యం, పెట్టెలు, ఇతర వస్తువులు కాలిపోయాయి. ఎవరూ ఆ ఇంట్లో ఉండకపోవడంతో పెద్ద ప్రమాదమే తప్పింది. రాత్రి ఇంట్లో దీపం పెట్టారు. దీని కారణంగా మంటలు వ్యాపించి ఇల్లు అంటుకుని ఉంటుందని కుటుంబీకులు తెలిపారు.

తాళం వేసిన ఏడు ఇళ్లలో చోరీలు

● వెల్దండ మండలం తిమ్మినోనిపల్లిలో సంఘటన



వెల్దండ: ఇళ్లకు తాళం వేసిన వాటిని ఎంపిక చేసుకుని దొంగలు ఏకంగా ఏడు ఇళ్లలో ఒకే రోజు చోరీలకు పాల్పడ్డారు. గ్రామస్తులు, పోలీసులు సంఘటనకు సంబంధించి తెలిపిన వివరాలు ఇలా ఉన్నాయి. వెల్దండ మండల పరిధిలోని తిమ్మినోనిపల్లిలో మంగళవారం రాత్రి గుర్తుతెలియని వ్యక్తులు ఏడు ఇళ్లలో చోరీకి పాల్పడ్డారు. సొంటి కృష్ణయ్య ఇంట్లో బంగారు రింగు, వెండి వస్తులు పూజ సామగ్రి ఎత్తుకెళ్లారు. రౌతు సత్యనారాయణగౌడ్ ఇంట్లో వెండి వస్తువులు, తోడేటి తిరుపతిరెడ్డి ఇంట్లో భూమి పత్రాలు, వెండి వస్తువులు, మెండే మల్లయ్య ఇంట్లో బంగారు ఉంగరం, కొట్టం లక్ష్మమ్మ ఇంట్లో రూ.5 వేల నగదు, సొంటి బాలయ్య ఇంట్లో రూ.2 వేల నగదు, బండ్ల నర్సింహ ఇంట్లో చోరీకి పాల్పడినట్లు వివరించారు. గ్రామాల్లో చోరీకి పాల్పడటంతో పోలీసులు క్లూస్ టీంతో ఆధారాలు సేకరించారు.

జడ్చర్లలో ఆటో..

జడ్చర్ల: పట్టణంలోని గౌరీశంకర్ కాలనీ రోడ్ నంబర్–6లో పార్కు చేసిన ఆటో చోరీకి గురయ్యింది. బాధితుడు రమేష్ వివరాల మేరకు.. బిజినేపల్లి మండలం వట్టెం గ్రామానికి చెందిన రమేష్ గౌరీశంకర్ కాలనీలో నివాసముంటూ ఆటో నడుపుకొని జీవనోపాధి పొందుతున్నాడు. ఈ క్రమంలో అద్దె ఇంటి వద్ద ఆటోను పార్కు చేసి సొంతూరికి వెళ్లాడు. మళ్లీ వచ్చే సరికి ఆటో కనిపించకుండా పోయింది. బాధితుడి ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసి దర్యాప్తు జరుపుతున్నట్లు సీఐ రమేష్‌బాబు తెలిపారు.

చలితో జర భద్రం..!

● హైపోథెరమితో చిన్నారుల నుంచి పెద్దలకు సమస్యే
● శ్వాసకోశ, ఆస్తమా కేసులు పెరిగే అవకాశం
● ముందస్తు జాగ్రత్తలతో రోగాల నియంత్రణ



పాలమూరు: జిల్లాలో చలి తీవ్రత పెరిగింది. రాత్రి ఉష్ణోగ్రతలు క్రమంగా పడిపోతున్నాయి. రాబోయే వారం రోజుల్లో మరింత తగ్గనున్నట్లు తెలుస్తుంది. ప్రధానంగా ఆరోగ్యంపై ఈ సీజన్ ప్రభావం కొంత అధికంగా ఉంటుంది. రోజు రోజుకు కనిష్ట ఉష్ణోగ్రతలు పడిపోతుంటే మనుషులు ఇంటి నుంచి బయటకు రావాలంటనే భయపడాల్సిన పరిస్థితి ఉంటుంది. తెల్లవారుజామున చలి మరింత ఎక్కువగా ఉండటంతో బయటికి వెళ్లే పరిస్థితి ఉండదు. వాతావరణంలో వచ్చిన ఆకస్మిక మార్పులతో జలుబు, దగ్గు తదితర సమస్యలతో అనారోగ్యం బారిన పడే అవకాశం ఉంటుంది. చలిని తట్టుకోలేక వృద్ధులు ఇబ్బంది పడే అవకాశం చాలా ఎక్కువగా ఉంది. చలికాలంలో రుగ్మతలు దరి చేరకుండా పరిశుభ్రతతో పాటు ఆహారపు అలవాట్లలో స్వల్ప మార్పులు చేసుకోవాలని వైద్య నిపుణులు సూచిస్తున్నారు. తగిన జాగ్రత్తలు తీసుకుంటే శరీరాన్ని కాపాడుకోవచ్చు.

హైపోథెరమితో ముప్పు

చలి తీవ్రతను కొందరు వృద్ధుల్లో చేతులు వంకర పోవడం వంటి లక్షణాలు ఏర్పడి మరణిస్తారు. దీన్నే ప్రాస్ట్‌బైట్ అంటారు. వృద్ధుల్లో శరీరానికి కావాల్సిన ఉష్ణోగ్రతలు ఉత్పత్తి కాకపోవడంతో మరణాలు సంభవిస్తాయి. దీన్ని వైద్య పరిభాషలో హైపోథెరమి అంటారు. శరీరంలోని రక్తనాళాల్లో రక్తం సరఫరాలో మార్పులు చోటు చేసుకుంటాయి. ఈ కాలంలో ఆస్తమా వ్యాధిగ్రస్తులు చాలా జాగ్రత్తగా ఉండాలి. వారికి ఊపిరితిత్తుల సమస్యలు ఏర్పడవచ్చు. బ్యాక్టీరియా వైరల్ ఇన్‌ఫెక్షన్స్ సోకుతాయి. జలుబు వల్ల ముక్కులోని నాళాల్లో సున్నితత్వం పెరుగుతుంది. ఇది ఆస్తమా బాధితులపై తీవ్ర ప్రభావం చూపుతుంది. పొడి చర్మం కలిగిన వారిలో దురదలు, ఫంగల్ ఇన్‌ఫెక్షన్స్ వస్తాయి. గొంతు ఇన్‌ఫెక్షన్, కీళ్ల నొప్పులు పెరుగుతాయి. గతంలో కీళ్ల నొప్పులు ఉన్న వారికి సమస్య అధికమవుతుంది. కొందరిలో తలనొప్పి వస్తుంది. గుండెపోటు వచ్చే ప్రమాదం కూడా ఉందని వైద్య నిపుణులు సూచిస్తున్నారు. కొంతమందిలో చలి కాలంలో కూడా పొక్కులు వస్తాయి. దీన్ని పాలీమార్ఫస్‌లైట్ ఎరప్షన్ అంటారు. మహిళలు బట్టలు ఉతకడం, గిన్నెలను తోమడం వంటి పనులను ఎక్కువగా చేస్తుంటారు. చలికాలంలో ఎక్కువ సమయం నీళ్లలో చేతులు ఉంచి పనులు చేయడం వల్ల చేతిపై ఉండే నూనె పొర తొలగిపోతుంది. సబ్బులు, డిటర్జెంట్లను ఉపయోగించడం వల్ల నూనె పొర తొలిగిపోయే అవకాశాలు ఎక్కువగా ఉంటాయి. తద్వారా చర్మం పొడిబారి చర్మ సంబంధిత సమస్యలు వస్తాయి. శీతల గాలులు చర్మాన్ని ఇబ్బంది పెడతాయి. శరీరాన్ని రక్షించే క్రమంలో చర్మమే చలికి ప్రభావితమవుతుంది. వాతావరణం చల్లగా ఉన్నప్పటికీ గాలిలో తేమశాతం తక్కువగా ఉంటుంది. శరీరంలోని తేమ బయటికి పోవడంతో చర్మం పొడిబారుతుంది. నూనె పొరను కాపాడుకునేందుకు ప్రయత్నించాలి. ఈ కాలంలో ఎండ తీక్షణంగా లేకపోయినా సూర్యకాంతి నుంచి అతినీలలోహిత కిరణాలు వెలువడతాయి.

అనారోగ్యానికి గురయ్యే అవకాశం



ఒకేసారి ఉష్ణోగ్రతలు తగ్గిపోవడంతో ఎక్కువ మంది అనారోగ్యానికి గురయ్యే అవకాశం ఉంది. వాతావరణంలో వచ్చే మార్పులు మరింత ఇబ్బందులకు గురి చేస్తాయి. పెద్దలతో పాటు పిల్లల్లోనూ జలుబు, దగ్గు గొంతు సమస్యలు వస్తాయి. బయట ఉన్న అల్ప ఉష్ణోగ్రతలను తట్టుకునేలా శరీరంలో వేడి ఉత్పత్తి అయ్యేందుకు జీర్ణవ్యవస్థ నిరంతరం పని చేస్తుండాలి. పిల్లలకు ప్రొటీన్లు అధికంగా లభించే కోడిగుడ్లు తదితర పదార్థాలను అందజేయాలి. కేవలం ఆకుకూరలు, కూరగాయలే కాకుండా మూలికలు, సుగంధ ద్రవ్యాలను కూడా తీసుకోవాలి. పిల్లలు, గర్భిణులు రోగనిరోధక శక్తి తక్కువగా ఉన్నవారు ఇన్‌ఫెక్షన్ల బారినపడే ప్రమాదం ఉంది. మధుమేహం, కాలేయం, ఊపిరితిత్తుల సమస్యలతో బాధపడేవారు పెద్ద వయస్కులు ఉదయం వేళ నడకకు వెళ్లవద్దు. చలికాలంలో వ్యాయామానికి బద్ధకించవద్దు. కనీసం 20 నిమిషాలైనా కసరత్తు చేయాలి.

– డాక్టర్ శ్రీనివాస్‌రెడ్డి, పల్మానాలజిస్ట్

నిర్లక్ష్యం చేయొద్దు..



చలిని ఏమాత్రం నిర్లక్ష్యం చేయరాదు. చలి వల్ల ముఖ్యంగా శ్వాసకోశ సంబంధించిన వ్యాధులు అధికంగా వచ్చే అవకాశం ఉంటుంది. గొంతునొప్పి, చలిజ్వరం, ఆస్తమా, బ్రాంకైటీస్, నిమోనియా వచ్చేందుకు సిద్ధంగా ఉంటాయి. దుమ్ము నోట్లోకి చేరడం వల్ల పలు రకాల ఇన్‌ఫెక్షన్లు వస్తుంటాయి. గాలిలో చల్లని తేమ వల్ల చిన్నారులకు త్వరగా జ్వరం వచ్చే అవకాశం ఉంటుంది. ఉష్ణోగ్రతలు తగ్గుతున్న సమయంలో ఇంట్లో వేడి పదార్థాలకు అధిక ప్రాధాన్యత ఇవ్వాలి.

–డాక్టర్ స్వరూప్, జనరల్ ఫిజీషియన్

వ్యాయామానికి వెళ్లే ముందు



ఎక్కువ మంది వ్యాయామం అంటే ఉదయపు నడకకే అధిక ప్రాధాన్యం ఇస్తారు. మహిళలు, మధ్య వయస్కులు, వృద్ధులు ఎక్కువగా వెళ్తుంటారు. మిగితా కాలాలతో పోల్చితే శీతాకాలంలో కొన్ని జాగ్రత్తలు తీసుకోవాలి. ఉదయం 6నుంచి 8గంటల మధ్య పొగ మంచులో కాలుష్యం కలిసి ఉంటుంది. బాగా ఎండ వచ్చే వరకు అదే పరిస్థితి ఉంటుంది. ఈ సమయంలో ఉదయం రన్నింగ్ చేసే వాళ్లు దాన్ని పీల్చేవారు శ్వాసకోశ వ్యాధులు బారినపడే ప్రమాదం ఉంటుంది. ఈ మూడు నెలలు ఉదయం 7గంటలు దాటిన తర్వాత వాకింగ్ చేయడం ఉత్తమం. కుదరకపోతే సాయంత్రం వేళలో చేసుకోవాలి తప్పదని అనుకునేవారు ముఖం, ముక్కు, చెవులు కప్పి ఉంచే టోపీలు, దుస్తులు, స్వెటర్లు ధరించాలి.

చర్మం పొడి బారుతుంది



చలికాలం మొదలు అయిన నాటి నుంచి చివరి వరకు చర్మంపై ఎక్కువ ప్రభావం చూపుతుంది. అధిక చలికి చర్మం పూర్తిగా పొడిబారి దురద పెట్టడం మొదలై పలు రకాల అలర్జీలు వస్తుంటాయి. దీంతో పాటు ఎగ్జియా, సోరియాసిస్ అధికం వస్తోంది. దీని వల్ల పలు రకాల సమస్యలు వస్తాయి. ఈ కాలంలో ప్రధానంగా చిన్నారులు, వృద్ధులపై ఎక్కువ ప్రభావం చూపుతుంది. ఇలాంటి వాటిని నివారించడానికి చల్లటి గాలికి తిరగరాదు. శీతల పానియాలు ఏమాత్రం తీసుకోరాదు. గోరు వెచ్చని నీటితో స్నానం చేయాలి. అధిక చలిలో పిల్లలు, వృద్ధులు ఎక్కువగా బయట తిరగకపోవడం మంచిది. పిల్లలను పాఠశాలలకు పంపే ముందు ఉన్ని దుస్తులు, షూ, చేతికి గ్లౌజ్‌లు ధరించేలా చూడాలి. కాచి చల్లార్చిన నీరు, పరిశుభ్రమైన ఆహారాన్ని తీసుకోవాలి.

ఇద్దరు విద్యార్థినులకు అస్వస్థత

అమ్రాబాద్: మండలంలోని జంగంరెడ్డిపల్లి గిరిజన ఆశ్రమ ఉన్నత పాఠశాలలో చదువుతున్న ఇద్దరికి అస్వస్థతకు గురయ్యారు. బుధవారం ఉదయం టిఫిన్ చేసిన తరగతి గదిలోకి వెళ్లిన అనంతరం తమ కళ్లు తిరుగుతున్నాయని తెలపడంతో వారిని హెచ్‌ఎం ఉమాదేవి అచ్చంపేట ప్రభుత్వ ఆస్పత్రికి తీసుకెళ్లి చికిత్స చేయించారు. అస్వస్థతకు గురైన విద్యార్థినులు బాగానే ఉన్నారని వైద్యులు ధ్రువీకరించగా, అనంతరం వారి తల్లిదండ్రులను పిలిపించి వారి ఇళ్లకు పంపినట్లు హెచ్‌ఎం తెలిపారు. విషయం తెలుసుకున్న డీటీడీఓ కమలాకర్‌రెడ్డి పాఠశాలను సందర్శించి పరిసరాలను పరిశీలించి విద్యార్థినులతో మాట్లాడారు.

ఒకరి ప్రాణం తీసిన సడెన్ బ్రేక్

● మరొకరికి తీవ్ర గాయాలు

మహబూబ్‌నగర్ క్రైం: జాతీయ రహదారిపై సడెన్ బ్రేక్ వేసిన డీసీఎంను బైక్ ఢీకొట్టిన ప్రమాదంలో ఓ యువకుడు అక్కడికక్కడే మృతి చెందగా.. మరో యువకుడికి తీవ్ర గాయాలయ్యాయి. రూరల్ ఎస్ఐ వెంకటేశ్వర్లు వివరాల మేరకు.. కర్నూల్ సీతారామనగర్‌కు చెందిన సాఫ్ట్‌వేర్ ఇంజినీర్ వెంకట సోమనాథ్ ఈశ్వర్ (26), తేజ్‌వంత్‌సింగ్ ఇద్దరు కలిసి బుధవారం బైక్‌పై హైదరాబాద్‌కు బయల్దేరారు. మహబూబ్‌నగర్ మండలం అంబటిపల్లి శివారులోని 44వ జాతీయ రహదారిపై వెళ్తున్న డీసీఎం డ్రైవర్ సడెన్ బ్రేక్ వేయడంతో వెనుక నుంచి వేగంగా వచ్చిన బైక్ ఢీకొట్టింది. ప్రమాదంలో వెంకట సోమనాథ్ ఈశ్వర్‌కు తీవ్రగాయాలై అక్కడికక్కడే మృతి చెందాడు. తేజ్‌వంత్‌సింగ్‌కు తీవ్రగాయాలు కావడంతో స్థానికులు చికిత్స నిమిత్తం జిల్లా జనరల్ ఆస్పత్రికి తరలించారు. మృతుడి తండ్రి వెంకట ప్రసాద్ ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్ఐ వెల్లడించారు.

వరిలో దోమపోటు



పైరుకు ఆశించిన దోమ

పాడి–పంట

అధికారి సలహా: సక్రియనాయక్, ఏడీఏ, అలంపూర్

అలంపూర్: వరి పంటను ఆశించి దిగుబడులను నష్టపరిచే ప్రధానమైన పురుగులలో దోమ ఒకటి. అధిక నత్రజని ఎరువులు, పైరు తొలి దశలో పురుగుల నివారణకు అధిక పురుగుల మందుల వాడకం, సింథటిక్ పైరిథ్రాయిడ్స్ వాడకం వల్ల దోమల ఉధృతి పెరుగుతుందని ఏడీఏ సక్రియ నాయక్ రైతులకు సూచిస్తున్నారు. వీటితోపాటు దోమ పోటు తట్టుకోలేని వంగడాలను సాగు చేయడం సమస్యకు ప్రధాన కారణమని వాటి గుర్తింపు, నివారణ మార్గాలను ఏడీఏ రైతులకు వివరిస్తున్నారు.

గోధుమరంగు దోమ

పెద్ద పురుగులు 4.5 నుంచి 5 మిల్లీ మీటర్ల పొడవుతో గోధుమ రంగులో ఉంటాయి. ఇవి రెండు రూపాల్లో చిన్న రెక్కలు గలవి. పొడవాటి రెక్కలు కలిగినవిగా ఉంటాయి. వాతావరణం ప్రతికూలంగా ఉన్నప్పుడు పంట పక్వదశకు చేరుకున్నప్పుడు రెక్కలు గల దోమలు వృద్ధి చెందుతాయి. సాధారణంగా పైరులో చిన్న రెక్కల దోమలు కనిపిస్తాయి. తల్లి దోమ 300 నుంచి 350 గుడ్లను ఆకు తొడిమ లోపలి కణజాలంలో, మధ్య ఈనెలో పెడతాయి. 2 నుంచి 12 గుడ్లను ఒకదాని పక్కన ఒకటి పెట్టి వాటి చివరలను ఒకదానితో ఒకటి కలిపి గుంపుగా ఉంచుతుంది. వీటి నుంచి 6 నుంచి 9 రోజుల్లో పిల్ల పురుగులు (శాభకాలు) వెలువడుతాయి. ఇవి తొలుత తెల్లగా ఉండి పెరిగో కొద్ది గోధుమ రంగులోకి మారుతాయి. ఇవి 19 నుంచి 23 రోజుల్లో ఐదుసార్లు కుబుసం విడిచి ప్రౌఢ దశకు చేరుకుంటాయి. దోమ వృద్ధికి అనుకూలమైన ఉష్ణోగ్రత 25 నుంచి 35 డిగ్రీలు.

తెల్ల వీపు మచ్చ దోమ

పెద్ద పురుగులు రంగుహీనంగా ఉన్న ముందు రెక్కలను కలిగి వాటిలో ముదురు రంగు ఈనెలను కలిగి ఉంటాయి. ముందు రెక్కలు కలిసే చోట నల్లటి మచ్చ ఉంటుంది. రెక్కల ముందు భాగంలో తెల్లటి మచ్చ ఉంటుంది. సాధారణంగా ఆరు నుంచి 8 గుడ్లను ఆకు తొడిమి లోపలి కణజాలంలో పెడుతుంది. వీటి గుడ్లను ఒక దానితో ఒకటి కలపదు. శాబకాలు తెల్లగా ఉండి 8 నుంచి 28 రోజుల్లో ప్రౌఢ దశకు చేరుకుంటాయి.

నష్టపరిచే విధానం – లక్షణాలు

గోధుమరంగు దోమ ప్రత్యక్షంగా నష్టం కలిగించడంతోపాటు పరోక్షంగా 'గ్రాస్టీ స్టంట్', 'రాగ్‌డ్ స్టంట్' వైరస్ తెగుళ్లను వ్యాపింపజేస్తాయి. పైరు పిలకల దశ నుంచి వీటి ఉనికి పొలంలో ఉన్నా, పైరు నాటిన 45 నుంచి 50 రోజులు వీటి ఉధృతి పెరుగుతూ.. పాలుపోసుకోనే దశకు చేరినప్పటికి అధికమవుతుంది. పిలకల దశలో ముందుగా తెల్ల మచ్చ దోమ ప్రారంభం అవుతుంది. తర్వాత 2 నుంచి 3 వారాలకు గోధుమ రంగు దోమ కనిపిస్తుంది. పిల్ల, పెద్ద పురుగులు అధిక సంఖ్యలో దుబ్బుల మొదళ్ల వద్ద చేరి మొక్కల నుంచి రసాన్ని పీల్చుతాయి. రసం పీల్చేటప్పుడు అవి వాటి చూషకాల చుట్టూ లాలాజలంతో తయారైన ఒక విధానమైన తొడుగులని ఏర్పరచుకుని వాటిని మొక్కలోని పోషక కణజాలం వద్ద వదిలి వేయడం వల్ల ఆ కణజాలం మూసుకొని పోయి వేరు వ్యవస్థకు పోషకాలు అందక అవి సక్రమంగా పని చేయవు. ఆకులు తొలుత పసుపు రంగుకు మారి దోమల ఉధృతి పెరిగే కొద్ది క్రమేనా మొక్కలు సుడులు సుడులుగా ఎండిపోతాయి. దీనినే సుడి తెగులు లేదా హాపర్ బర్న్ అని అంటారు.

నివారణ ఇలా

వీటి నివారణకు కేవలం పురుగు మందులపైనే ఆధారపడక వాటి వృద్ధిని నిరోధించే అన్ని పద్ధతులను సమగ్రంగా అవలంబించాలి.

దూరం దూరంగా నాట్లు వేసుకోవాలి

- నాటే సమయంలో ప్రతి రెండు మీటర్ల ఊడ్పుకి 20 సెంటీమీటర్ల కాలిబాటలు వదలాలి.
- పైరు దుబ్బ చేసే దశలో పొలాన్ని అడపా.. దడపా ఆరబెట్టుకోవాలి.
- నత్రజని ఎరువులను సిఫార్సు మేరకు వాడాలి.
- పిలకలు వేసే దశలో పురుగు మందులు అవసరం మేరకే వాడాలి. రెండు, మూడు రకాల పురుగు మందులు కాని, తెగుళ్ల మందులతో కలిపికాని వాడరాదు. దోమల వృద్ధిని పెంపొందించే సింథటిక్ పైరిథ్రాయిడ్స్ వాడరాదు.
- పిలకలు తొడిగే దశలో దుబ్బుకి 10 నుంచి 15 దోమలు అభివృద్ధి చెందే దశలో 20 నుంచి 25 దోమల కంటే అధికంగా ఉన్నప్పుడు మాత్రమే పురుగు మందుల ద్వారా సస్యరక్షణ చేపట్టాలి.
- దోమల సంఖ్య తక్కువగా ఉన్నప్పుడు బ్రూప్రోఫెజిన్ 1.6 మిల్లీ లీటర్లు లేదా ఇమిడాక్లోప్రిడ్ +ఎథిప్రోల్ 25 గ్రాములు లేదా డిన్యోటెప్యూలాన్ 0.4 గ్రాములు లేదా పైమెటోజైం 0.6 గ్రాములు చొప్పున లీటరు నీటికి కలిపి పిచికారి చేసుకోవాలి.
- వాటి సంఖ్య 100కుపైబడి ఉన్నప్పుడు ఎసిఫెట్ 1.5 గ్రాములు లేదా ఇథోపెనీ ప్రాక్స్ 2.0 మిల్లీ లీటర్లు చొప్పున లీటరు నీటికి కలిపి పిచికారి చేసుకోవాలి. వాటి సంఖ్య 200కుపైగా ఉన్నప్పుడు, పైరు పసుపు రంగుకు మారుతున్నప్పుడు త్వరితంగా వాటిని నివారించడానికి మోనోక్రోటోఫాస్ 2.2 మిల్లీ లీటర్లు+డైక్లోరోవాసం 1.0 మిల్లీ లీటర్లు లేదా ఫినోబుకార్బ్ 2.0 మిల్లీ లీటర్లు నీటిని కలిపి పిచికారి చేసుకోవాలి. పిచికారి చేసిన వెంటనే నీటిని పొలం నుంచి బయటకు తీయాలి.

చెట్టును ఢీకొట్టిన కారు



మరికల్: రాయచూర్ నుంచి హైదరాబాద్‌కు కారులో వెళ్తున్న వారు పస్పుల స్టేజీ సమీపంలోకి రాగానే బుధవారం తెల్లవారుజమున అదుపు తప్పిన కారు చెట్టును ఢీకొట్టింది. కారులో ప్రయాణిస్తున్న వారికి ఎలాంటి ప్రమాదం కాలేదు. పొక్లెయినర్ సాయంతో కారును పక్కకు తీసి హైదరాబాద్‌కు తరలించారు. ఈ ఘటనపై పోలీసులకు ఎలాంటి సమాచారం లేదని తెలిపారు.


వాట్సప్‌లో అసభ్యకర చాటింగ్‌పై కేసు నమోదు

మాగనూర్: మండల కేంద్రానికి చెందిన ఇద్దరు యువకుల వాట్సప్ చాటింగ్ కాస్తా పోలీస్‌స్టేషన్‌లో ఫిర్యాదు వరకు వెళ్లింది. స్థానిక ఎస్ఐ మల్లేష్ వివరాల మేరకు.. మాగనూర్‌లో మైత్రి వనం అనే వాట్సప్ గ్రూప్‌లో గ్రామానికి చెందిన అజయ్, భాస్కర్‌లు బస్సు, బైక్ ప్రమాదం విషయంపై చాటింగ్ చేసుకున్నారు. ఈ క్రమంలో భాస్కర్.. అజయ్ తల్లిపై అసభ్యకరంగా పోస్టింగ్ చేశాడు. విషయం తెలుసుకున్న అజయ్ తల్లి స్వరూప భాస్కర్ ఇంటికి వెళ్లి నిలదీసింది. ఈ సందర్భంగా వ్యక్తిగత దూషణలు చేస్తూ అసభ్యంగా మాట్లాడాడని, బాధితురాలి ఫిర్యాదు మేరకు సెక్షన్ 509 కింద భాస్కర్‌పై కేసు నమోదు చేసినట్లు ఎస్ఐ తెలిపారు.

హత్య కేసులో ముగ్గురికి రిమాండ్

జడ్చర్ల: జడ్చర్ల మండలం ఆలూరుకు చెందిన మల్లేష్ హత్య కేసును పోలీసులు చేధించారు. ఇందుకు సంబంధించిన వివరాలను సీఐ రమేష్‌బాబు బుధవారం వెల్లడించారు. ఆలూరుకు చెందిన గొప్ప మల్లేష్ (34)కు భార్య మంజుల, ఇద్దరు పిల్లలు ఉన్నారు. బాదేపల్లి వ్యవసాయ మార్కెట్‌లో మంజుల కూలీ పనులు చేస్తుండగా.. మల్లేష్ మేస్త్రీ పనులు చేసేవాడు. ఈ క్రమంలో మంజులకు మార్కెట్‌లో హమాలీగా పనిచేసే గొల్లపల్లి గ్రామవాసి నాగయ్యతో పరిచయం ఏర్పడి వివాహేతర సంబంధానికి దారితీసింది. నాలుగేళ్లుగా వీరి సంబంధం కొనసాగుతోంది. ఈ విషయం భర్త మల్లేష్‌కు తెలియడంతో మంజులను మందలించాడు. ఈ క్రమంలో మల్లేష్ అడ్డు తొలగించుకోవాలని మంజుల, ఆమె ప్రియుడు నాగయ్య నిర్ణయించుకున్నారు. అందులో భాగంగా మల్లేష్‌తో సన్నిహిత సంబంధాలు ఉన్న ఆలూరు గ్రామవాసి రాములుకు రూ.లక్ష ఇచ్చి హతమార్చేందుకు పథకం రచించారు. ఈ మేరకు ఈ నెల 7న రాత్రి రాములు తన స్కూటీపై మల్లేష్‌ను ఎక్కించుకుని వ్యవసాయ పొలానికి వెళ్లారు. ఇద్దరు కలిసి మద్యం తాగారు. మద్యం మత్తులోకి జారుకున్న మల్లేష్‌ను రాములు కర్రతో బాది హత్య చేశాడు. అనంతరం తనకేమీ తెలియనట్లుగా ఇంటికి వచ్చి అందరితో కలిసి మెలసి ఉన్నాడు. హత్య కేసును సమగ్రంగా విచారించి నిందితులను గుర్తించామని.. హతుడి భార్య మంజులతో పాటు నాగయ్య, రాములును అరెస్టు చేసి కోర్టులో హాజరుపర్చగా రిమాండ్‌కు తరలించినట్లు సీఐ తెలిపారు.

లభ్యంకాని ఆచూకీ



ఆత్మకూర్: ఆత్మకూర్‌లో గుర్తుతెలియని మృతదేహం మంగళవారం లభ్యమవగా.. అందుకు సంబంధించిన ఆచూకి తెలియలేదని, అతనికి సుమారు 50 ఏళ్ల వయస్సు ఉంటుందని ఎస్ఐ నరేందర్ తెలిపారు. స్థానిక సాయివెంకటేశ్వర సప్లయర్స్ ఎదురుగా సోమవారం రాత్రి నిద్రించిన వ్యక్తి అనారోగ్యంతో చలికి తట్టుకోలేక మృతిచెందాడన్నారు. మృతదేహాన్ని స్థానిక ప్రభుత్వ ఆస్పత్రికి తరలించి మార్చురీలో భద్రపర్చామని చెప్పారు. అతని వద్ద ఎలాంటి గుర్తింపుకార్డులు లేవని తెలిపారు. మృతదేహాన్ని గుర్తించిన వారు సీఐ 8712670630, లేదా ఎస్ఐ 8712670631 నంబర్లకు సమాచారం ఇవ్వాలని కోరారు.

చదువుకు అంధత్వం అడ్డుకావొద్దు



మాట్లాడుతున్న న్యాయమూర్తి సంధ్యారాణి

పాలమూరు: చదువుపై పట్టుసాధించడానికి అంధత్వం అడ్డుకాదని, అంధులుగా ఉండి రాణించిన వ్యక్తుల జీవితాలను ఆదర్శంగా తీసుకొని ముందుకు సాగాలని జిల్లా న్యాయ సేవాధికార సంస్థ కార్యదర్శి, సీనియర్ సివిల్ జడ్జి సంధ్యారాణి అన్నారు. జిల్లాకేంద్రంలోని మెట్టుగడ్డ సమీపంలో ఉన్న అంధుల పాఠశాలలో న్యాయ అవగాహన సదస్సు నిర్వహించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ చిన్ననాటి నుంచే ఉన్నత లక్ష్యాలు నిర్దేశించుకొని జీవితంలో ఉన్నతంగా స్థిరపడేలా చూడాలన్నారు. తాము అంధులమని ఆలోచన ఏమాత్రం రావొద్దన్నారు. విద్యార్థులకు ఏదైనా ఇబ్బందులు ఉంటే చట్టాలను సద్వినియోగం చేసుకోవాలన్నారు. ప్రతి విద్యార్థి ఆత్మస్థైర్యంతో ముందుకు సాగడంతోపాటు చదువులో రాణించాలన్నారు. న్యాయపరమైన సమస్యలు ఉంటే న్యాయ సేవా సంస్థ కార్యాలయంలో ఫిర్యాదు చేయాలన్నారు. కార్యక్రమంలో లీగల్ ఎయిడ్ డిఫెన్స్ కౌన్సిల్ చీఫ్ రఘుపతి, పాఠశాల ప్రిన్సిపాల్ ఉమ మంజుల, రాజేష్ తదితరులు పాల్గొన్నారు.

■ మహబూబ్‌నగర్ జిల్లా కోర్టుతోపాటు జడ్చర్ల కోర్టులలో ప్రత్యేక బెంచీలు ఏర్పాటు చేసి ఈ నెల 30న జాతీయ లోక్ అదాలత్ నిర్వహిస్తున్నట్లు జిల్లా న్యాయ సేవా అధికార సంస్థకార్యదర్శి సంధ్యారాణి ఒక ప్రకటనలో తెలిపారు. దీర్ఘకాలికంగా పెండింగ్‌లో ఉన్న పలు కేసులకు సంబంధించిన కక్షిదారులు లోక్ అదాలత్‌కు హాజరై కేసులను శాశ్వతంగా పరిష్కరించుకోవాలన్నారు. లోక్ అదాలత్ కోసం జిల్లా పోలీసులు అధి కమొత్తంలో కేసులు గుర్తించి సహకరించాలన్నారు.

చోరీకి యత్నించిన వ్యక్తికి దేహశుద్ధి



చోరీకి యత్నించిన వ్యక్తి

కల్వకుర్తి టౌన్: ఇంట్లో చోరీకి యత్నించిన వ్యక్తిని కాలనీవాసులు పట్టుకుని దేహశుద్ధి చేశారు. ఈ ఘటన కల్వకుర్తి పట్టణంలోని బలరాంనగర్ కాలనీలో బుధవారం చోటుచేసుకుంది. స్థానికుల వివరాల మేరకు.. పట్టణంలోని బలరాంనగర్ కాలనీలో నివాసముండే లక్ష్మయ్య ఇంట్లో అదే కాలనీకి శంకర్ చోరీకి యత్నించాడు. గమనించిన కుటుంబ సభ్యులు అతడిని పట్టుకుని కేకలు వేయడంతో కాలనీవాసులు అక్కడికి చేరుకొని దేహశుద్ధి చేశారు. కాగా.. తాను చోరీ చేయడానికి రాలేదని, మరో వ్యక్తి ఇంట్లోకి రావడాన్ని గమనించి పట్టుకునేందుకు వచ్చానని చెప్పడంతో కాలనీవాసులు మరింత ఆగ్రహానికి గురయ్యారు. విషయం తెలుసుకున్న పోలీసులు అక్కడికి చేరుకొని శంకర్‌ను పోలీస్‌స్టేషన్‌కు తరలించారు. అయితే చోరీకి యత్నించాడంటున్న వ్యక్తిపై ఇప్పటి వరకు ఎలాంటి ఆరోపణలు లేవని, చోరీ కాకుండా దీని వెనుక ఇతర కారణాలు ఉన్నాయని కాలనీవాసులు అంటున్నారు. ఈ విషయమై ఎస్ఐ రమేష్‌ను వివరణ కోరగా.. పూర్తిస్థాయి విచారణ అనంతరం వివరాలను వెల్లడిస్తామని తెలిపారు.

నేటి నుంచి జోనల్ స్థాయి క్రీడా పోటీలు

అచ్చంపేట రూరల్: పట్టణంలోని ఎన్టీఆర్ మినీస్టేడియంలో గురువారం నుంచి 16వ తేదీ వరకు గిరిజన సంక్షేమ శాఖ నాగర్‌కర్నూల్ జిల్లా ఆధ్వర్యంలో నాలుగో జోనల్ స్థాయి క్రీడా పోటీలు నిర్వహించనున్నట్లు జిల్లా గిరిజన అభివృద్ధి అధికారి కమలాకర్‌రెడ్డి బుధవారం ఒక ప్రకటనలో తెలిపారు. అండర్ 14, 17విభాగాల్లో ఖోఖో, వాలీబాల్, కబడ్డీ, టెన్ని కాయిట్, ఆర్చరీ, అథ్లెటిక్స్ పోటీలను బాల, బాలికలకు నిర్వ హించనున్నామని చెప్పారు. ఉమ్మడి మహబూబ్‌నగర్, నల్ల గొండ జిల్లాలోని ఆశ్రమ పాఠశాల, వసతిగృహాల్లోని విద్యార్థినీ, విద్యార్థులు సుమారు 1600 మంది దాకా పోటీల్లో పాల్గొంటారని చెప్పారు. క్రీడా పోటీల ప్రారంభోత్సవానికి కలెక్టర్ ఉదయ్‌కుమార్, ఎమ్మెల్యే డాక్టర్ వంశీకృష్ణ, జిల్లాస్థాయి అధికారులు, ప్రజాప్రతినిధులు హాజరవనున్నట్లు తెలియజేశారు.

ఆరు లేన్లు అయ్యేనా?

- 65 నంబర్ జాతీయ రహదారి విస్తరణపై మంత్రి కోమటిరెడ్డి ప్రకటన
- విస్తరణ పూర్తయితే రెండున్నర గంటల్లోనే హైదరాబాద్ నుంచి విజయవాడకు


ఆరు వరుసలుగా మార్చాల్సిన జాతీయ రహదారి ఇదే

చౌటుప్పల్: త్వరలో హైవే విస్తరణకు చర్యలు తీసుకుంటామని మంత్రి కోమటిరెడ్డి వెంకట్‌రెడ్డి ఇటీవల ప్రకటన చేశారు. దీంతో హైదరాబాద్– విజయవాడ 65వ నంబరు జాతీయరహదారి ఆరు లేన్ల విస్తరణకు మోక్షం లభించే అవకాశాలు కనిపిస్తున్నాయి. ఇదే జరిగితే హైదరాబాద్ నుంచి విజయవాడకు కేవలం రెండున్నర గంటల్లోనే చేరుకోవచ్చు. మంత్రి ప్రకటనతో తెలంగాణ, ఏపీ రాష్ట్రాలకు చెందిన వాహనదారులు, ప్రజల్లో ఆశలు చిగురిస్తున్నాయి.

బీఓటీ పద్ధతిన నాలుగు లేన్లుగా విస్తరణ

హైదరాబాద్ – విజయవాడ మధ్య 275 కిలోమీటర్ల దూరం ఉంది. ఇందులో హైదరాబాద్ నుంచి యాదాద్రి జిల్లా చౌటుప్పల్ మండలం దండుమల్కాపురం వరకు, ఏపీలోని విజయవాడ నుంచి నందిగామ వరకు నాలుగు లేన్ల రోడ్డుగా వాజ్‌పేయి ప్రధానిగా ఉన్న సమయంలో విస్తరించారు. మిగిలిన 180 కిలోమీటర్లు మాత్రం బీఓటీ పద్ధతిన నాలుగులేన్లుగా నిర్మించారు. ఈ పనులను జీఎంఆర్ సంస్థ చేపట్టింది. ఈ పనులకు అప్పటి సీఎం రోశయ్య 2010 మార్చిలో నార్కట్‌పల్లి వద్ద శంకుస్థాపన చేశారు. రెండేళ్లలో నిర్మాణ పనులు పూర్తి చేసి మూడు ప్రాంతాల్లో టోల్‌ప్లాజాల వద్ద టోల్ రుసుము వసూలు చేస్తోంది.

కోర్టును ఆశ్రయించిన జీఎంఆర్ సంస్థ

ఈ హైవేను ఆరులేన్లుగా విస్తరించాలని ఉమ్మడి నల్లగొండ జిల్లా నుంచి ఎంపీలుగా ప్రాతినిధ్యం వహించిన కోమటిరెడ్డి వెంకట్‌రెడ్డి, ఉత్తమ్‌కుమార్‌రెడ్డిలు ఎప్పటికప్పుడు కేంద్రం దృష్టికి తీసుకెళ్లి ఒత్తిడి తీసుకొచ్చారు. అయితే హైవే విస్తరణ పనులు చేపట్టిన కాంట్రాక్టు సంస్థ జీఎంఆర్ ముందస్తుగా కోర్టును ఆశ్రయించింది. తాము బీఓటీ పద్ధతిలో రోడ్డు నిర్మాణ పనులు చేశామని, టోల్ వసూలు చేసుకునేందుకు తమకు ఇంకా గడువు ఉందని, పెట్టుబడి కింద టోల్ వసూళ్లు అనుకున్న మేరకు రానందున మరికొంత కాలం అనుమతి ఇప్పించాలని కోర్టుకు వెళ్లింది. దీంతో విస్తరణ ప్రక్రియ వాయిదా పడుతూ వచ్చింది.

అత్యంత రద్దీ రహదారిగా గుర్తింపు

హైదరాబాద్– విజయవాడ హైవే దేశంలోనే అత్యంత రద్దీ రహదారిగా గుర్తింపు పొందింది. టోల్‌ప్లాజాల లెక్కల ప్రకారం రోజూ సగటున 40వేల నుంచి 50వేల వాహనాలు ఈ మార్గంలో వెళుతున్నాయి. దీనిపై ఏ చిన్నపాటి ప్రమాదం జరిగినా గంటల తరబడి ట్రాఫిక్ జామ్ అవుతోంది.

అన్ని విధాలుగా ప్రయోజనం



హైవేను ఆరు వరుసలుగా విస్తరిస్తే ప్రమాదాలు చాలా వరకు తగ్గుతాయి. వాహనదారులు, ప్రయాణికులకు సమయం కూడా కలిసివస్తుంది. మంత్రి కోమటిరెడ్డి వెంకట్‌రెడ్డి ఆధ్వర్యంలో విస్తరణ పనులు త్వరలోనే ప్రారంభమవుతాయని ఆశిస్తున్నాం.

– చిలుకూరి ప్రభాకర్‌రెడ్డి, చౌటుప్పల్ జెడ్పీటీసీ సభ్యుడు

సర్వీస్ రోడ్లు ఏర్పాటు చేయాలి



ప్రస్తుతం నాలుగు వరుసలుగా ఉన్న హైవేపై నిత్యం వాహనాల రద్దీ ఉంటుంది. దీనిని తగ్గించడానికి ఆరు వరుసలు అవసరం. విస్తరణతోపాటు హైవే వెంట ఉన్న అన్ని గ్రామాల వద్ద సర్వీసు రోడ్లు నిర్మించాలి.

– బాతరాజు సత్యం, పంతంగి సర్పంచ్

మళ్లీ పులి భయం

పులి భయం మళ్లీ మొదలైంది. కుమురంభీం జిల్లా కాగజ్‌నగర్ మండలం నందిగూడ అటవీ ప్రాంత శివారులో రెండురోజుల కిందట పశువును చంపేసి.. పశువుల కాపరి గులాబ్‌పై దాడి చేసిన ఘటన దరిమిలా ఆ ప్రాంత సమీప ప్రజల్లో తీవ్ర భయాందోళనలు నెలకొన్నాయి. ఆ ఘటనలో గులాబ్ అప్రమత్తంగా వ్యవహరించి ప్రాణాలతో బయటపడగా, చేతికి గాయాలయ్యాయి. ప్రతీ ఏడాది పత్తి తీసే ఇదే సీజన్‌లోనే పులుల సంచారం పెరుగుతోంది. దీంతో పత్తి చేన్లకు వెళ్లాలన్నా, జీవాలను మేతకు తీసుకెళ్లాలన్నా కాపర్లు జంకుతున్నారు.

– సాక్షి ప్రతినిధి, మంచిర్యాల


ఈ నెల 12న పశువుల కాపరిపై దాడి చేసిన ఆడపులి (ఎస్9)

ఏటా ఇదే సీజన్‌లో భయపెడుతున్న టైగర్	నందిగూడ శివారులో పశువును చంపి.. కాపరిపై దాడి	పత్తి చేన్లకు వెళ్లాలంటే జంకుతున్న స్థానికులు	అటవీ సమీప ప్రాంతాల వరకు పులి సంచారం

మూడేళ్లుగా మనుషులపై దాడులు

గత మూడేళ్లుగా నవంబర్ నుంచి జనవరి మధ్యే పులుల దాడులు అధికంగా ఉంటున్నాయి. రాష్ట్రంలో తొలిసారిగా 2020 నవంబర్ 11న ఏ2 అనే పులి కుమురంభీం జిల్లా దహెగాం మండలం దిగిడకు చెందిన సిడాం విగ్నేశ్(21) పత్తి చేనుకు వెళ్తుండగా దాడి చేసి చంపేసింది. అదే నెల 29న పెంచికల్‌పేట మండలం కొండపల్లికి చెందిన పసుల నిర్మల(18)ను పొట్టన పెట్టుకుంది. కేవలం మూడు వారాల వ్యవధిలోనే ఇద్దరి మృతితో స్థానికుల నుంచి నిరసనలు వచ్చాయి. దాంతో అటవీ శాఖ సీరియస్‌గా తీసుకుని ఆ పులిని బంధించే ప్రయత్నం చేసినా.. సాధ్యపడలేదు. ఆ తర్వాత పులి మహారాష్ట్ర వైపు వెళ్లిపోవడంతో ఊపిరి పీల్చుకున్నారు. మళ్లీ గతేడాది నవంబర్‌లోనే కుమురంభీం జిల్లా వాంకిడి మండలం ఖానాపూర్‌కు చెందిన రైతు సిడాం భీము(69)ను పత్తి చేనులో ఉండగా దాడి చేసి చంపేసింది. తాజాగా పశువుల కాపరిపై దాడి జరిగింది.

జత కట్టే సమయంలో?

పులులు జత కట్టే సమయం నవంబర్ నుంచి ఏప్రిల్ మధ్యే కావడం, తోడు, ఆవాసం కోసం తోటి పులుల మధ్య ఆధిపత్య పోరు, వాగులు, నదులు, ప్రాజెక్టుల్లో నీటి లభ్యత ఉన్న చోట సంచరిస్తూ అనుకోకుండా మనుషులు ఎదురుపడితే దాడులకు ప్రధాన కారణమవుతున్నాయని అటవీశాఖ వర్గాలు అంచనా వేస్తున్నాయి.

ఉమ్మడి ఆదిలాబాద్ మహారాష్ట్ర, తెలంగాణ సరిహద్దు.. పులుల రాకపోకలకు ప్రధాన కారిడార్‌గా ఉంది. ఆదిలాబాద్ నుంచి ఆసిఫాబాద్, మంచిర్యాల వరకు పులుల సంచారం ఉంటోంది. పెన్‌గంగా, ప్రాణహిత తీరాలు దాటి తిప్పేశ్వర్, తడోబా టైగర్ రిజర్వ్ పులుల అభయారణ్యాల నుంచి వలస వస్తుంటాయి. ఎనిమిదేళ్ల క్రితం పాల్గుణ అనే ఆడపులి కాగజ్‌నగర్‌లోనే స్థిర నివాసం ఉండటంతో సంతతి పెరిగింది. ఇలా అనేక పులులు ఒక్కొక్కటిగా తెలంగాణ భూభాగంలో ఆవాసం, తోడు వెతుక్కుంటూ అడుగుపెడుతున్నాయి. టైగర్ రిజర్వు పరిధి కోర్ ఏరియా మంచిర్యాల జిల్లా జన్నారం డివిజన్ కవ్వాల్‌లో మాత్రం ఇప్పటికీ ఒక్క పులి కూడా స్థిరంగా ఉండలేదు. కేవలం బఫర్ ప్రాంతాల్లోనే పులులు సంచరించడంతో సమస్య మొదలవుతోంది. ఆ ప్రాంతాల్లోనే పత్తి చేన్లు, మానవ సంచారం ఉండడంతో ఎదురుపడిన సందర్భంలో దాడి చేస్తున్నాయి. నిత్యం ఆదిలాబాద్ డివిజన్‌లో తాంసి, భీంపూర్, ఆసిఫాబాద్ జిల్లా కాగజ్‌నగర్ డివిజన్‌లో దహెగాం, పెంచికల్‌పేట, బెజ్జూరు, బెల్లంపల్లి, చెన్నూరు డివిజన్ల వరకు పులులు తిరుగుతుంటాయి. మహారాష్ట్ర, తెలంగాణ సరిహద్దు పిప్పల్‌కోట్, కాగజ్‌నగర్ డివిజన్ అడవుల్లో అనేకసార్లు స్థానికులకు పులులు ఎదురుపడ్డాయి. అడవిలో వన్యప్రాణుల కంటే సులువుగా దొరికే మేతకు వెళ్లిన పశువులు, మేకలు, గొర్రెల పైనే దాడి చేస్తూ ఆకలి తీర్చుకుంటున్నాయి. అలా పశువులు నష్టపోయిన రైతులకు పరిహారం కూడా అటవీ శాఖ చెల్లిస్తోంది. అయితే ఇప్పుడు మనుషులపై దాడి చేయడమే ఆందోళన కలిగిస్తోంది.

బఫర్ జోన్‌లోనే సంచారం

పులుల కదలికలు పెరిగిన చోట్ల ప్రజలను అప్రమత్తం చేయండి

క్షేత్రస్థాయి అధికారులకు అటవీశాఖ ఆదేశాలు

సాక్షి, హైదరాబాద్: రాష్ట్రంలోని పలు ప్రాంతాల్లో పులుల కదలికలు పెరిగి, కొన్నిచోట్ల మనుషులతో ఘర్షణ పూరిత వాతావరణానికి పరిస్థితులు దారితీస్తుండటంతో క్షేత్రస్థాయి అధికారులు తగిన జాగ్రత్తలు తీసుకోవాలని అటవీశాఖ సూచించింది. ముఖ్యంగా అడవులకు ఆనుకుని ఉన్న గ్రామాలు, పులుల సంచారం అధికంగా ఉన్న ప్రాంతాల్లోని ప్రజలు మరింత అప్రమత్తంగా వ్యవహరించేలా అవసరమైన చర్యలు చేపట్టాలని ఆదేశించింది. మంగళవారం కుమురంభీం జిల్లాలో పశువుల కాపరిపై పెద్దపులి దాడి ఘటన, కొల్లాపూర్ సర్కిల్ పరిధిలో మరో పులి కనబడడం, మహారాష్ట్ర– ఆదిలాబాద్ టైగర్ కారిడార్ పరిధిలో పులుల కదలికలు పెరగడం వంటి ఘటనల నేపథ్యంలో ఆయా అంశాలు చర్చకు వచ్చాయి. పులులు లేదా అడవి జంతువుల దాడుల్లో పశువులు, ఇతర ఆస్తులకు నష్టం జరిగితే వెంటనే పరిహారం ఇచ్చేలా చర్యలు తీసుకోవాలని శాఖ అధికారులను అటవీశాఖ ఆదేశించింది. ఒకవేళ పులుల దాడిలో మనిషి చనిపోతే రూ. 5 లక్షల పరిహారం, గాయపడితే చికిత్సకు అయ్యే ఖర్చును అటవీశాఖ భరిస్తోంది. బుధవారం అరణ్యభవన్‌లో పీసీసీఎఫ్ ఆర్‌ఎం డోబ్రియాల్ అధ్యక్షతన జరిగిన సమీక్షలో ఆమ్రాబాద్ టైగర్ రిజర్వ్, జోగుళాంబ సర్కిల్‌లో చేపట్టిన, వచ్చే ఏడాది చేపట్టబోయే కార్యకలాపాలపై చర్చించినట్టు తెలిసింది. వచ్చే ఏడాది...అటవీ శాఖ పరంగా అనుసరించాల్సిన ప్రణాళికలు– చేపట్టాల్సిన కార్యకలాపాలపై సమీక్ష నిర్వహించారు. 2024లో చేపట్టాల్సిన పథకాలు, వాటికయ్యే వ్యయం తదితరాలపై వార్షిక బడ్జెట్‌లో భాగంగా... శాఖకు సంబంధించి అందుబాటులో నిధులు, వాటి వినియోగం వంటి అంశాలపై చర్చించారు.




ఘనంగా భారత నావికా దళ వారోత్సవాలు

సాక్షి, హైదరాబాద్: భారత నావికాదళం వారోత్సవాల్లో భాగంగా బుధవారం సికింద్రాబాద్‌లో నావికా దళానికి చెందిన బ్యాండ్ విభాగం ఉత్సవాలు నిర్వహించింది. ఈ కార్యక్రమానికి గవర్నర్ తమిళిసై సౌందరరాజన్ ముఖ్య అతిథిగా హాజరయ్యారు. నావికాదళ విజయాలను తెలిపే పలు బ్యానర్లను ఈ సందర్భంగా ప్రదర్శించారు. 1971లో జరిగిన యుద్ధంలో పాకిస్తాన్‌పై భారత్ సాధించిన విజయాన్ని గుర్తుచేస్తూ ఏటా ఈ వారోత్సవాలు నిర్వహిస్తారు. కార్యక్రమంలో కమాండర్ మనోజ్ సెబాస్టియన్, అసిస్టెంట్ ప్రిన్సిపల్ కమాండర్ జే పద్మనాభన్ తదితరులు పాల్గొన్నారు.

జూరాలకు తగ్గిన ఇన్‌ఫ్లో

- కొనసాగుతున్న నెట్టెంపాడు ఎత్తిపోతల నీటి పంపింగ్

ధరూరు: ప్రియదర్శిని జూరాల ప్రాజెక్టుకు ఎగువ ప్రాంతం నుంచి వస్తున్న ఇన్‌ఫ్లోలు స్వల్పంగా తగ్గినట్లు పీజేపీ అధికారులు తెలిపారు. నెట్టెంపాడు ఎత్తిపోతల పథకంలో ఒక పంపు ద్వారా నీటి పంపింగ్‌ను కొనసాగిస్తున్నట్లు పీజేపీ అధికారులు తెలిపారు. బుధవారం రాత్రి 7 గంటల వరకు ప్రాజెక్టుకు కేవలం 592 క్యూసెక్కుల ఇన్‌ఫ్లో ఉన్నట్లు పీజేపీ అధికారులు తెలిపారు. నెట్టెంపాడు ఎత్తిపోతలకు 750 క్యూసెక్కులు, ఆవిరి రూపంలో 67 క్యూసెక్కులు, భీమా లిఫ్టు–2కు 392 క్యూసెక్కులు, ఎడమ కాల్వకు 325 క్యూసెక్కులు, కుడి కాల్వకు 401 క్యూసెక్కులు, ఆర్‌డీఎస్ లింక్ కెనాల్‌కు 300 క్యూసెక్కులు ప్రాజెక్టు నుంచి మొత్తం 1,935 క్యూసెక్కుల నీటిని దిగువకు విడుదల చేస్తున్నారు. జూరాల ప్రాజెక్టు పూర్తిస్థాయి నీట్టిం 9.657 టీఎంసీలు కాగా.. ప్రస్తుతం ప్రాజెక్టులో 7.971 టీఎంసీల నీరు నిల్వ ఉన్నట్లు అధికారులు తెలిపారు.

ఉత్సాహంగా ఎస్‌జీఎఫ్ బాక్సింగ్ ఎంపికలు



మహబూబ్‌నగర్ క్రీడలు: జిల్లా కేంద్రం మెయిన్ స్టేడియంలోని మల్టీపర్పస్ ఇండోర్‌లో బుధవారం స్కూల్ గేమ్స్ ఫెడరేషన్ ఉమ్మడి జిల్లా అండర్–14, అండర్–17 విభాగాల బాక్సింగ్ ఎంపికలు నిర్వహించారు. ఈ సందర్భంగా ఎస్‌జీఎఫ్ జిల్లా కార్యనిర్వాహక కార్యదర్శి రమేశ్‌బాబు మాట్లాడారు. రాష్ట్ర స్థాయి బాక్సింగ్ పోటీల్లో ఉమ్మడి జిల్లా క్రీడాకారులు ప్రతిభచాటి పతకాలు సాధించాలని కోరారు. కార్యక్రమంలో ఎస్‌జీఎఫ్ సహాయ కార్యదర్శి వేణుగోపాల్, కోచ్ నర్సింలు పాల్గొన్నారు.

బాక్సింగ్ క్రీడాకారులు

అండర్–14 విభాగం భరత్ (40–42కేజీ), అండర్–17 అజయ్ (46–48కేజీ), శివకృష్ణ (–46కేజీ), చరణ్‌సాయి (57–60కేజీ), పల్లవి (44–46కేజీ), శ్రీలత (46–48కేజీ), మంజుల (48–50కేజీ), సరస్వతి (50–52కేజీ)

దడ పుట్టిస్తున్న సన్న బియ్యం


ఓ రైస్ డిపోలో అమ్మకానికి ఉన్న బియ్యం సంచులు

- సాగు తగ్గడమే ప్రధాన కారణం
- రోజురోజుకు పెరుగుతున్న ధరలు
- ఇదే అదునుగా కృత్రిమ కొరత శృష్టిస్తున్న కొందరు వ్యాపారులు

కల్వకుర్తి రూరల్: సన్నబియ్యానికి రెక్కలు వచ్చాయి. వాటి ధరలు అమాంతం పెరిగిపోయాయి. దీంతో సామాన్య మధ్యతరగతి ప్రజలకు భారంగా మారింది. కేవలం 4 నెలల వ్యవధిలోనే క్వింటాల్ బియ్యం ధర రూ.600 నుంచి రూ.1,000 వరకు పెరగడం ఆందోళన కలిగిస్తుంది. సన్న రకాల సాగు తక్కువగా ఉండటంతో ధరలు పెరుగుతున్నాయని వ్యాపారులు చెబుతున్నారు. సామాన్యులపై ఆర్థికభారం పడి కుటుంబ బడ్జెట్ మార్చుకోవాల్సిన పరిస్థితులు నెలకొన్నాయి. జిల్లాలో 80 శాతం కుటుంబాలు సన్నరకం బియ్యమే వినియోగిస్తున్నారు. జనవరి మాసంలో క్వింటాల్ సన్న బియ్యం ధర రూ.3,000 నుంచి రూ.3,400 ఉండగా.. పాత బియ్యం రూ.4,200 నుంచి రూ.4,500 వరకు ధర పలికింది. నాలుగు నెలలుగా బియ్యం ధర పెరుగుతూ వచ్చింది. ప్రస్తుతం పాత బియ్యం ధర క్వింటాల్‌కు రూ.5,050 నుంచి రూ.5,250 ధర పలుకుతుంది. ఈ లెక్కన ప్రజలపై ఏ స్థాయిలో ఆర్థికభారం పడుతుందో అర్థం చేసుకోవచ్చు. ఇప్పటికే సన్నరకాల నిత్యావసర సరుకుల ధరలు పెరిగిన నేపథ్యంలో సన్నబియ్యం ధరలు కూడా పెరగడంతో సామాన్య, మధ్యతరగతి ప్రజలు హడలిపోతున్నారు. ధరలు దిగిరాకున్నా.. నిలకడ అయిన ఉంటాయా అనేది తెలియని పరిస్థితి నెలకొంది. మరోవైపు నిల్వలు తక్కువగా ఉండటంతో రాబోయే రోజుల్లో ధరలు మరింత పెరిగే అవకాశం ఉందని వ్యాపారులు చెబుతున్నారు. ఇదే అదునుగా కొందరు వ్యాపారులు సన్న బియ్యానికి కృత్రిమ కొరత శృష్టించి రహస్యంగా గోదాంలో నిల్వ చేస్తున్నట్లు సమాచారం.

పెరిగిన దొడ్డు రకాల సాగు

జిల్లాలో సన్న రకాల సాగు తగ్గుతుంది. మొత్తం వరిసాగు విస్తీర్ణంలో దొడ్డు రకాలే సాగు చేస్తుండగా.. 30 శాతం మాత్రమే బీపీటీ, ఆర్‌ఎన్‌ఆర్‌తో పాటు వివిధ రకాల సన్న రకాలను పండిస్తున్నారు. దొడ్డు రకాలు సాగుచేస్తే ఎకరాకు రూ.23 వేల పెట్టుబడి అవుతుండగా.. 25 నుంచి 28 క్వింటాళ్ల ధాన్యం దిగుబడి వస్తుంది. సన్నాలసాగు ఖర్చు శ్రమతో కూడుకున్న పని, దిగుబడి కూడా తక్కువగా ఉండటం, చీడపీడల బెడద అధికంగా ఉంటుంది. సన్నాల సాగు ఎకరాకు రూ.30 వేల పెట్టుబడి పెడితే 18 నుంచి 20 క్వింటాళ్లకు మించి దిగుబడి వచ్చే పరిస్థితి లేదు. ఇంత చేస్తే దొడ్డు రకాలకు సన్న రకాలకు ప్రభుత్వం మద్దతు ధరలో వ్యత్యాసం ఏమి లేదు. దీంతో రైతులు అత్యధికం దొడ్డు రకాల సాగుకు మొగ్గు చూపుతున్నారు. రెండు సంవత్సరాల కిందటి వరకు సన్నాలు సాగు చేయాలనే ప్రభుత్వ సూచన మేరకు చాలా మంది రైతులు సన్న బియ్యం పండించారు. అయితే మద్దతు ధర సన్నాలకు, దొడ్డు రకానికి తేడా లేకపోవడంతో సన్నాలను తగ్గించి దొడ్డు రకాలకు ప్రాధాన్యం ఇస్తున్నారు.

భారంగా మారాయి



నిత్యావసర సరుకుల ధరలన్నీ పెరిగిపోయాయి. సన్న బియ్యం ధర ఆకాశాన్ని అంటిఉండటంతో ఆర్థికభారం పెరిగిపోయింది. ప్రభుత్వం బియ్యం ధరలతో పాటు నిత్యావసర సరుకుల ధరలను నియంత్రిస్తే భారం తగ్గుతుంది. బియ్యం ధరలు పెరగకుండా చూడాలి.

– శ్రవంతి గృహిణి కల్వకుర్తి

సమస్యలు వస్తున్నాయి



బియ్యం ధరల్లో వ్యత్యాసాలు వస్తుండటంతో వినియోగదారులతో సమస్యలు వస్తున్నాయి. వారం రోజుల్లోనే క్వింటాల్ బియ్యం ధర రూ.500 నుంచి రూ.1,000 వరకు పెరగడంతో వినియోగదారులపై భారం పడటంతో వ్యాపారస్తులకు ఇబ్బందిగా మారింది. ధరల స్థిరీకరణ లేకపోవడం సమస్యగా మారింది.

– జి.కిషన్, బియ్యం వ్యాపారి కల్వకుర్తి

ధరల నియంత్రణలో చర్యలు తీసుకోవాలి..

ధరల నియంత్రణపై సంబంధిత అధికారుల పర్యవేక్షణ లేకుండాపోయింది. దీంతో వ్యాపారులు ఇష్టానుసారంగా ధరలు పెంచి నిత్యావసర సరుకులను బహిరంగంగా మార్కెట్‌లో విక్రయిస్తున్నారనే ఆరోపణలు ఉన్నాయి. ఉన్నతాధికారులు ప్రతినెల సమీక్ష సమావేశం నిర్వహించి, ప్రస్తుతం ఉన్న ధరలు క్రయవిక్రయాలపై చర్చించాలి. ఒక వేళ ధరలు పెరిగితే కారణాలు ఏమిటనే విషయంపై వ్యాపారులతో చర్చించాలి. వ్యాపారులు కృత్రిమ కొరత శృష్టిస్తే చర్యలు తీసుకోవాలి. కాని ఇవేమి కనిపించకపోవడంతో ధరల పెరుగుదలకు అడ్డూఅదుపు లేకుండా పోతుంది. జిల్లాలో ఎలాంటి అనుమతులు లేకుండా బియ్యం అమ్మకాలు కొనసాగుతున్నాయి. ఇంత జరుగుతున్నా.. అధికారులు తమకేమి పట్టనట్లు వ్యవహరిస్తుండటంతో ధరల నియంత్రణ తూకంలో వ్యత్యాసాలకు అడ్డుకట్ట పడటం లేదు.

పారా ఒలింపిక్‌స్థాయికి ఎదగాలి

- జిల్లా యువజన, క్రీడల అధికారి ఎస్.శ్రీనివాస్
- ఉత్సాహంగా జిల్లాస్థాయి దివ్యాంగుల క్రీడాపోటీలు


షాట్‌పుట్ విసురుతున్న దివ్యాంగ క్రీడాకారులు

మహబూబ్‌నగర్ క్రీడలు: దివ్యాంగ క్రీడాకారులు పారా ఒలింపిక్ స్థాయికి ఎదగాలని జిల్లా యువజన, క్రీడల అధికారి ఎస్.శ్రీనివాస్ అన్నారు. జిల్లాకేంద్రంలోని మెయిన్ స్టేడియంలో అంతర్జాతీయ దివ్యాంగుల దినోత్సవం సందర్భంగా బుధవారం జిల్లాస్థాయి దివ్యాంగుల క్రీడా మహోత్సవం నిర్వహించారు. దివ్యాంగుల క్రీడాపోటీలను జిల్లా యువజన, క్రీడల అధికారి శ్రీనివాస్ జెండా ఊపి ప్రారంభించారు. డీవైఎస్‌ఓ మాట్లాడుతూ ఇలాంటి క్రీడాపోటీల వల్ల దివ్యాంగుల్లో క్రీడానైపుణ్యాన్ని పెంపొందించవచ్చన్నారు. దివ్యాంగుల్లో ఆత్మస్థైర్యానికి క్రీడాపోటీలు ఉపయోగపడుతాయని అన్నారు. క్రీడా పోటీలను దివ్యాంగులు సద్వినియోగం చేసుకోవాలని కోరారు. ఆసక్తిగల దివ్యాంగులు స్టేడియంకు వస్తే వారికి కోచ్‌ల ద్వారా మెరుగైన శిక్షణ అందిస్తామని చెప్పారు. కార్యక్రమంలో జిల్లా రెడ్‌క్రాస్ చైర్మన్ నటరాజ్, జిల్లా మహిళా శిశు, దివ్యాంగుల, వయోవృద్ధుల సంక్షేమశాఖ సూపరింటెండెంట్ అరుంధతి, గన్నోజు చంద్రశేఖర్, డీఎస్‌ఏ కోచ్‌లు సునీల్‌కుమార్, ఎండీ ఖలీల్, అంజద్, వ్యాయామ ఉపాధ్యాయులు అరుణజ్యోతి, భవ్యశ్రీ, ఉమారాణి, శైలజ తదితరులు పాల్గొన్నారు.

ఉత్సాహంగా క్రీడాపోటీలు

దివ్యాంగుల జిల్లాస్థాయి క్రీడాపోటీలు ఉత్సాహంగా జరిగాయి. జూనియర్, సీనియర్ విభాగాల్లో దివ్యాంగులకు పరుగు పందెం, షాట్‌పుట్, చెస్, క్యారమ్స్, జావెలిన్ త్రో, షాట్‌పుట్ అంశాల్లో క్రీడాపోటీలు నిర్వహించారు. వీల్ చైర్, ట్రై సైకిల్ పరుగు పందెం పోటీలు ఆకట్టుకున్నాయి. దివ్యాంగులు ఎంతో ఆత్మవిశ్వాసంతో క్రీడాపోటీల్లో పాల్గొని క్రీడాస్ఫూర్తిని చాటారు. గురువారం క్రీడాపోటీల్లో గెలుపొందిన వారికి బహుమతులు అందజేస్తామని అధికారులు తెలిపారు.


క్రీడాపోటీలను ప్రారంభిస్తున్న డీవైఎస్ ఎస్.శ్రీనివాస్


వీల్‌చైర్ పరుగు పోటీలు

తగ్గని ఉల్లి ధర

- గరిష్టంగా రూ.3,510.. కనిష్టంగా రూ.1,800

దేవరకద్ర: పట్టణంలోని వ్యవసాయ మార్కెట్ యార్డులో బుధవారం జరిగిన వేలంలో ఉల్లిగడ్డ క్వింటాల్‌కు గరిష్టంగా రూ.3,510, కనిష్టంగా రూ.1,800 ధరలు లభించాయి. గత మూడు నెలలుగా ఉల్లి ధరలు తగ్గడం లేదు. వానాకాలం కింద సాగైన ఉల్లి ప్రస్తుతం మార్కెట్‌కు వస్తున్నా ధరలు మాత్రం నిలకడగా ఉన్నాయి. మార్కెట్‌కు వివిధ గ్రామాల నుంచి ఉల్లి అమ్మకానికి రావడంతో వ్యాపారులు వేలం ద్వారా కొనుగోలు చేశారు. మార్కెట్‌లో 45 కిలోల బస్తా ధర రూ.1,800 నుంచి రూ.వెయ్యి వరకు విక్రయించారు.

ఆర్‌ఎన్‌ఆర్ క్వింటా రూ.3,300

దేవరకద్ర మార్కెట్‌లో జరిగిన టెండర్లలో ఆర్‌ఎన్‌ఆర్ ధర క్వింటాల్‌కు గరిష్టంగా రూ.3,300, కనిష్టంగా రూ.2,540 ధరలు వచ్చాయి. హంస గరిష్టంగా రూ.2,059, కనిష్టంగా రూ.2,041 చొప్పున లభించాయి. మార్కెట్‌కు కేవలం ఒక క్వింటాల్ వచ్చిన కందుల ధర రూ.11 వేలు పలికింది.

ధాన్యం ధరలు పైపైకి..

జడ్చర్ల: ధాన్య ధరలు రోజురోజుకు ఎగబాకుతున్నాయి. గతంలో ఎప్పుడూ లభించని ధరలు దక్కుతుండటంతో రైతులు హర్షం వ్యక్తం చేస్తున్నారు. బాదేపల్లి వ్యవసాయ మార్కెట్ యార్డులో బుధవారం ధాన్యానికి రికార్డు స్థాయి ధర దక్కింది. ఆర్‌ఎన్‌ఆర్ రకం ధాన్యానికి క్వింటా గరిష్టంగా రూ.3,454 ధర లభించింది. ఇప్పటి వరకు యార్డు చరిత్రలో ఇంత ధర పలకలేదు. కనిష్టంగా రూ.2,139 ధర వచ్చింది. అలాగే హంస రకానికి గరిష్టంగా రూ.2,086, కనిష్టంగా రూ.1,813, చిట్టిముత్యాలు ధాన్యంకు రూ.3,069, మొక్కజొన్నకు గరిష్టంగా రూ.2,357, కనిష్టంగా రూ.2,281 ధరలు వచ్చాయి.


దేవరకద్ర మార్కెట్‌లో అమ్మకానికి సిద్ధం చేస్తున్న ఉల్లి బస్తాలు

జాతీయ సివిల్ సర్వీసెస్ పోటీలకు వడెన్న

- రాష్ట్ర ఫుట్‌బాల్ జట్టుకు ఎంపిక

మహబూబ్‌నగర్ క్రీడలు: ఢిల్లీలో ఈ నెల 15 నుంచి 20 వరకు జరిగే 18వ జాతీయ స్థాయి సివిల్ సర్వీసెస్ ఫుట్‌బాల్ పోటీలకు జిల్లాలోని రాజాపూర్ జెడ్పీహెచ్‌ఎస్ ఫిజికల్ డైరెక్టర్ వడెన్న ఎంపికయ్యారు. జాతీయస్థాయి పోటీల్లో పాల్గొనే తెలంగాణ రాష్ట్ర సివిల్ సర్వీసెస్ ఫుట్‌బాల్ జట్టులో వడెన్న చోటు దక్కించుకున్నారు. వడెన్న గతంలో మూడుసార్లు జాతీయ స్థాయి సివిల్ సర్వీసెస్ ఫుట్‌బాల్ పోటీలకు రాష్ట్రానికి ప్రాతినిధ్యం వహించారు. ఈయన జాతీయస్థాయి పోటీలకు ఎంపికకావడంపై జిల్లా(పెటా) టీఎస్ జిల్లాశాఖ అధ్యక్ష, కార్యదర్శులు జగన్‌మోహన్‌గౌడ్, రాజవర్ధన్‌రెడ్డి, టీజీ(పెటా) రాష్ట్ర వర్కింగ్ ప్రసిడెంట్ దూమర్ల నిరంజన్, జిల్లా రగ్బీ అసోసియేషన్ ప్రధాన కార్యదర్శి నిరంజన్‌రావు, ఎస్‌జీఎఫ్ జిల్లా కార్యనిర్వాహక కార్యదర్శి రమేశ్‌బాబు, వేణుగోపాల్, పీడీ, పీఈటీలు విలియం, గజానంద్, బాల్‌రాజు తదితరులు హర్షం వ్యక్తం చేశారు.


వడెన్న